ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
మే 05, 2019

బాలల ప్రపంచం

వేసవి ప్రత్యేక సంచిక

NAVEEN PRASAD
VISAKHAPATNAM
Cell · 984907083?

ఆటలు, పాటలు, కేరింతలు, అల్లర్లు, చిలిపి చేష్టలు, ముద్దుముద్దు మాటలు, కనిపించే ప్రతిదాన్ని తెలుసుకునే ప్రశ్నలతో సాగేదే బాల్యం. పిల్లలు ఎండాకాలం సెలవుల కోసం సంవత్సరమంతా వేయి కళ్లతో ఎదురు చూస్తుంటారు. ఆటపాటల్లో పడి ఆకలి దప్పికలను సైతం మరచిపోయేంత ఉత్సాహంగా ఉరకలేస్తుంటారు. స్కూలుకెళ్లాలంటే బద్ధకంగా నిద్రలేవని వాళ్లు సెలవుల్లో అమ్మ లేపకుండానే ఉదయాన్నే లేచి ఆటలకు సిద్ధమౌతారు. ఈ సరదాల్లో వారికి తెలియకుండానే ఎన్నో విషయాలను నేర్చుకుంటారు. చుట్టూ ఉన్న పిల్లలను కలుపుకుపోతారు. గాయాలైనప్పుడు ప్రేమగా చూడటం, నొప్పిని భరించడం, తప్పు చేసిన వారిని ఎదిరించడం, గెలవాలనే ఆరాటం, ఓటమిని స్వీకరించడం ఇవన్నీ సెలవుల ఆటల్లోనే..! హుషారుగా ఉండే పిల్లల సంతోషానికి ఆటల్లో పెద్ద దెబ్బలు ఆటంకం కలుగకుండా తగు జాగ్రత్తలు వహించాలి.



సరదాల వేసవిలో...

★ ఉదయం 10 గంటల తర్వాత సాయంత్రం 4.30 మధ్య కాలంలో ఆరుబయట ఆడకపోవడమే మంచిది.

★ పగటివేళలో ఆడుకునేప్పుడు వదులుగా లేత రంగు కాటన్ దుస్తులు, టోపీలు, చలువద్దాలు ధరించడం ఉత్తమం.

★ పెద్దల పర్యావేక్షణ లేకుండా స్విమ్మింగ్ పూల్స్‌లోకి, చెరువుల్లోకి దిగకూడదు. చెట్లు, గోడలు, భవనాలపైకి ఎక్కి దూకకూడదు. కర్రలతో, రాళ్లతో ఆడకూడదు.

★ ఊయల ఊగేవారికి ముందుగా వెళ్లకుండా, అప్ అండ్ డౌన్ ఆటలో కిందకి దిగేప్పుడు వేగంగా దిగకుండా, జారుడు బల్లపై చెప్పులతో పైకి ఎక్కకుండా, విరిగిపోయిన ఆటపరికరాల వద్దకు వెళ్లకుండా ఉండాలి.

★ సైకిళ్లు తొక్కేటప్పుడు పక్కపక్కగా పోటాపోటీ పడకుండా నిదానంగా వెళ్లాలి.

★ బ్రెయిన్‌విటా ఆడేప్పుడు చిన్నపిల్లలు గోళీలను నోట్లో పెట్టుకోకుండా జాగ్రత్త వహించాలి.

★ కేరమ్స్ ఆడేప్పుడు కాయిన్స్ ఎగిరేట్లుగా స్ట్రైకింగ్ చేయటం వల్ల ఎదుటి వారికి గాయాలు కాని విధంగా చూసుకోవాలి.

★ ఆరుబయట నీడలో ఆడుకున్నా వేడి గాలికి వడదెబ్బ తగిలే అవకాశముంటుంది కాబట్టి జాగ్రత్త వహించాలి.

★ సూర్యరశ్మికి ఆడుకునే పిల్లల్లో 2 నుంచి 3 లీటర్ల నీరు చమట రూపంలో ఆవిరైపోతుంది. కాబట్టి తాగునీటిని అందుబాటులో ఉంచుకోవాలి.

★ ఎప్పుడూ ఫస్ట్ ఎయిడ్ కిట్ అందుబాటులో ఉంచుకోవాలి.

★ ఆటల్లో పడి దాహాన్ని, ఆకలిని మరచిపోవడమో లేదా ఆ తర్వాతలే అని నిర్లక్ష్యం చేస్తుంటారు. సమయానుకూలంగా ఆహారాన్ని అందించడంలో తల్లిదండ్రులే బాధ్యత వహించాలి.

★ ఆటల అనంతరం కచ్చితంగా చేతులు శుభ్రపరుచుకోవాలి.





మీ రచనలు, బొమ్మలు, పంపాల్సిన చిరునామా :
స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం : 27-30-4, ఆకుల వారి వీధి,
గవర్నర్ పేట, విజయవాడ-520002.
మెయిల్ అడ్రస్ : snehaweekly.praja@gmail.com

శిబిరాల్లో ఏం నేర్చారు? ... 7
పరీక్షల చివరిరోజు ... 14
మెదడుకు మేత ... 12
ఊరు చెబితే.. వినండి! ... 5
పిల్లల ఊహలకు విజ్ఞాన రెక్కలు ... 16

ముఖచిత్రం : విజయ్ జో

పిల్లల సంచికకు స్వాగతం!

బాలమిత్రులూ,

వేసవి సెలవులను బాగా గడుపుతున్నారా? ఆటపాటలతో పాటు కొత్త కొత్త అంశాలు నేర్చుకుంటున్నారా? ఊళ్లకు వెళుతున్నారా? అక్కడ రకరకాల అనుభవాలు ఎదురవుతున్నాయా? కొత్త స్నేహాలు కుదురుతున్నాయా? ఈ ప్రశ్నలన్నింటికీ 'ఎస్.. ఎస్' అనేది మీ జవాబు అయితే- మరి ఆ కబుర్లు మాతో కూడా పంచుకోండి. పేపరూ పెన్నూ అందుకోండి. ఆ సంగతులన్నీ చక్కగా రాసేయండి. మాకు పంపండి. విభిన్నంగా ఉన్నవాటికి చక్కని బొమ్మలు లేదా మీరు పంపిన ఫొటోలు జోడించి, 'స్నేహ'లో అచ్చు వేస్తాం!

అవునూ... మీకు కథలు రాయటం కూడా వచ్చు కదా? బొమ్మలు కూడా గీస్తారట కదా? ఇంకేం? ఓ కథ రాసి, బొమ్మ గీసి పంపేయండి. బాగుంటే- చూడచక్కగా ప్రచురిస్తాం.

నేస్తాలూ,

మీ సెలవుల సందడిలో ప్రజాశక్తి కూడా పాలు పంచుకుంటోంది. మా ఆటపాటల్లో భాగస్వామి అవుతుంది. మీ చిట్టిపొట్టి రచనలకు వేదిక అవుతుంది. అందులో భాగంగానే ఇప్పటికే రోజూ మెయిన్ పత్రికలో 'వేసవి విడిది' అందిస్తున్నాం. రెండు ఆదివారం స్నేహ సంచికలను ప్రత్యేకంగా మీకోసం రూపొందిస్తున్నాం. ఇప్పుడు మీ చేతిలో ఉన్నది తొలి వేసవి ప్రత్యేక సంచిక. దీనిలో మీకు పనికొచ్చే చాలా విషయాలు పొందుపర్చాం. అలాగే మెదడుకు మేత పేరిట ఒక పోటీ కూడా ఉంది. మధ్య పేజీల్లో చూడండి. అందరూ పాల్గొనండి.

తరువాత మరొక వేసవి ప్రత్యేక సంచిక జూన్ 2వ తేదీన వస్తుంది. దాన్లో అన్నీ మీలాంటి చిన్నారులు రాసిన కథలూ కబుర్లూ, చక్కగా గీసిన బొమ్మలూ ఇస్తాం. ఆ సంచిక కోసం పదిమంది పిల్లలతో ఒక సంపాదక బృందం కూడా ఏర్పాటు చేస్తున్నాం. ఈ సంచిక కోసం మీరు తప్పకుండా రాయాలి సుమా! అలాగే ఈ సంచిక ఎలా ఉందో కూడా మీ అభిప్రాయాలు చెప్పండి.

- ఎడిటర్

మీ సౌర కుటుంబం..

ఆకాశంలో పగలు సూర్యుడిని, రాత్రి చందమామ, నక్షత్రాలను చూసినపుడు కొన్ని వందల ప్రశ్నలు మీ బుజ్జి బుర్రలో మొలకెత్తుంటాయి. పెద్దల నుంచి వాటిని తెలుసుకునే ఉంటారు. అంతరిక్షంలో సూర్యుడి చుట్టూ గ్రహాలు, వాటి చుట్టూ ఉపగ్రహాలు తిరుగుతాయనే విషయం మనల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. మరీ దగ్గరగా బుధగ్రహం తిరిగితే మన భూమి మూడో కక్ష్యలో ఉంటుందనీ తెలుసు. అన్ని గ్రహాల కన్నా పెద్దగా బృహస్పతి, గ్రహం స్థానాన్ని కోల్పోయినా మనం బాగా ఇష్టపడే బుల్లి గోళం ప్లూటో సంగతులూ బాగానే తెలుసు. ఇవన్నీ మాటల్లో నానమ్మకు, తాతయ్యకు ఆపసోపాలు పడుతూ చెబుతాం. అదే మీరే ఓ 'సౌర కుటుంబ' నమూనాను తయారు చేసేస్తే..! భలే కదూ..!

కావాల్సిన వస్తువులు :
దీర్ఘచతురస్ర ఆకారంలో ఉండే ఓ మందపాటి థర్మాకోల్ షీట్ (పొడవు 40 సెం.మీ, వెడల్పు 60 సెంటీమీటర్లు), వైట్ డ్రాయింగ్ షీట్ – 1, బ్లాక్ డ్రాయింగ్ షీట్ – 2, స్కెచ్ సెట్ – 1, వైట్ మార్కర్ – 1, గమ్ బాటిల్ – 1, స్ట్రాలు, పుల్లలు, దారం (గుండ్రటి ఐస్‌క్రీమ్ కప్పులు, ప్లాస్టిక్ బంతులు ఏవైనా రకరకాల సైజుల్లో..)

తయారీ విధానం: వైట్ డ్రాయింగ్ షీట్‌ను తీసుకుని ఐదు సెంటీమీటరు ఉండే ఓ చుట్టు కొలతకోసం పెద్ద సైజు గాజును తీసుకుని గుండ్రని ఆకారంలో వైట్ షీట్ పైన డ్రా చేసుకుని రెండింటిని కట్ చేసుకోవాలి. తర్వాత అదే విధంగా నాలుగు సెంమీ, (ఒకటి) మూడు సెంమీ (మూడు), రెండు సెంమీ (ఒకటి), ఒక్క సెంమీ (మూడు) ఈ విధంగా మన సౌర కుటుంబం ఉన్న తొమ్మిది గ్రహాలను అమర్చేందుకు గుండ్రంగా కట్ చేసుకుని పెట్టుకోవాలి. ఇప్పుడు థర్మాకోల్ షీటు పైన బ్లాక్ డ్రాయింగ్ షీటును గమ్‌తో అంటించెయండి. తర్వాత వైట్ మార్కర్ తీసుకుని తెల్లని చుక్కలను పెట్టండి. కాసేపు ఆ బోర్డును ఆరనివ్వండి. ఇప్పుడు గ్రహాలకు రంగులు వేయండి. సూర్యుడికి పసుపు, ఎరుపు. బుధుడికి (మెర్క్యూరీ), నారింజ, శుక్రుడుకి (వీనస్) డార్క్ బ్రౌన్, భూమికి (ఎర్త్) నీలం, ఆకుపచ్చ, అంగారకుడికి (మార్స్) ఎరుపు, బృహస్పతికి (జూపిటర్) లైట్ బ్రౌన్, శనికి (శాట్రర్న్) నీలం, బ్రౌన్, యురేనస్‌కి నీలం, నెప్ట్యూన్‌కి బ్రౌన్ వేయండి. ఇప్పుడు పది సెంటీమీటర్ల లోపు సూర్యుడిని అంటించి అక్కడ నుంచి కింది వరకూ ఐదు సెంటీమీటర్ల గ్యాప్‌తో తొమ్మిది గీతలను అర్ధ వృత్తాకారంలో వైట్ మార్కర్‌తో గీసుకోవాలి. రంగులు వేసిన గ్రహాల్ని గీతలపైన అంటించుకోవాలి. ఇప్పుడు గ్రహాల పేర్లను కింద రాయండి. అంతే..! స్వయంగా మీరు తయారు చేసిన మన సౌర కుటుంబం నమూనా మీ చేతిలోనే ఉంది. ఇదేకాదు, కింది చిత్రాల్ని చూసి మరిన్ని రకాలుగానూ ట్రైచేసి అందర్నీ సర్‌ప్రైజ్ చేయండి.

పిల్లలూ మీరు తయారు చేసిన క్రాఫ్ట్‌ని ఫొటోలు తీసి, మీ వివరాల్ని మీ ఫొటోతోపాటు పంపిస్తే ప్రచురిస్తాం. ఎంపికైన వాటికి మంచి బహుమతిని అందజేస్తాం.



అంకెలతో ఆడుకుందామా..!

నేస్తాలూ,

మీకు మాయాచదరాలు తెలుసు కదా? వాటినే మేజిక్ స్క్వేర్స్ అంటామని కూడా మీకు తెలుసు కదా? తొమ్మిది గడుల చదరంలో అంకెలను ఎటు కూడినా ఒకే సంఖ్య రావటమే ఇందులోని తమాషా. ఇప్పుడంటే- పత్రికల్లో సుడోకు పజిల్ వచ్చింది కానీ, గతంలో అయితే- ఇవే ఎక్కువగా కనిపించేవి. ఎటు కూడినా ఒకే సంఖ్య రప్పించటానికి మీలాంటి పిల్లలు తెగ కుస్తీ చేస్తూ ఉండేవారు. ఇప్పుడు మనం అలాంటి మాయాచదరాలను చూద్దాం. చూడటమే కాదు; స్వయంగా వాటిని తయారు చేద్దాం కూడా!

ఈ కింది చదరాన్ని చూడండి. తొమ్మిది గడులూ, తొమ్మిది అంకెలూ ఉన్నాయి. వాటిని నిలువు, అడ్డ వరుసలు ఎలా కూడినా వాటి మొత్తం 15 అవుతుంది. ఐమూల నుంచి కూడినా 15నే వస్తుంది. అదే దీనిలోని తమాషా. అంకెల కూర్పులో ఉన్న మాయాజాలం!

4	9	2
3	5	7
8	1	6

ఇప్పుడు ఇలాంటి వాటిని ఎలా తయారు చేయొచ్చో చూద్దామా? తొలుత మీకు తోచిన అంకెలు లేదా సంఖ్యలు వరుసగా తీసుకోండి. అవి కచ్చితంగా ఒక క్రమంలో ఉండాలి. 17 నుంచి మొదలు పెడితే... 18, 19, 20, 21... ఇలా 25తో ముగియాలి. లేదంటే- ఒక క్రమంలో ఉండే గుణిజాలను కూడా తీసుకోవచ్చు. ఒక క్రమంలో సరి సంఖ్యలు లేదా బేసి సంఖ్యలను కూడా తీసుకోవచ్చు. వాటి మధ్య ఒక నియమబద్ధ సంబంధం మాత్రం కచ్చితంగా ఉండి తీరాలి.

ఉదాహరణకు 3 యొక్క గుణిజాలను తీసుకుందాం. 3, 6, 9, 12 ... ఇలా 27 వరకూ. వాటి ఆధారంగా ఒక మాయాచదరం తయారుచేద్దాం. చేయాలంటే – అంకెలను చదరం మాదిరిగా అమర్చాలి.

3	6	9
12	15	18
21	24	27

ఇప్పుడు ఈ అంకెల మధ్య కింది చూపిన విధంగా ఐమూలలుగా గీతలు గీయాలి.



ఇప్పుడు చూడండి. కొన్ని అంకెలు గడులకు బయట ఉన్నాయి. మరికొన్ని లోపల ఉన్నాయి. అలాగే కొన్ని గడులు ఖాళీగా ఉన్నాయి. ఇప్పుడు బయట ఉన్న అంకెలను వాటికి ఎదురుగా అదే వరుసలో ఉన్న మూడో గడిలోకి తీసుకెళ్లండి. ఇక బయట అంకెలేమీ లేవు. గడులూ ఖాళీగా లేవు. ఇప్పుడు ఆ అంకెల చదరాన్ని నీటుగా తీయండి. గీస్తే- ఇలా ఉంటుంది.

12	27	6
9	15	21
24	3	18

ఇప్పుడు ఈ అంకెలను ఎటు నుంచి ఎటైనా కూడి చూడండి. ఐమూలగా కలిపి చూడండి. ఆశ్చర్యం కదూ? ఎటు కూడినా జవాబు 35 వస్తుంది. అంటే మీరొక మాయాచదరం తయారు చేసేసినట్టే! ఇంకా ఇలాంటివి చాలా ట్రై చేసి చూడండి. మీ మిత్రులకు పరిచయం చేయండి. తమ్ముళ్లకు, చెల్లెళ్లకూ నేర్పండి. ఆడుకోవటం మొదలెడితే అంకెలంత సరదా సరదా మిత్రులు మరెవరూ ఉండరు మరి! అన్నట్టు.. ఇలా తొమ్మిది గళ్ల చదరాలనే కాదు; ఇంకా పెద్దపెద్దవి కూడా తయారుచేయొచ్చు. వాటి గురించి తరువాత మీ లెక్కల మాస్టారిని అడిగి తెలుసుకోండి.

- శాంతిమిత్ర

ప ద వి కా సం

కూర్పు : రావెళ్ల

ఆధారాలు

అడ్డం

1. చివరి పరీక్షలు కాగానే పిల్లలకు ఇచ్చేవి (4)
3. కాగితాలతో చేసి నీళ్లలో వదిలేవి (4)
7. ఆరు తరువాత అంకె (2)
8. పిల్లలకు చదువు కంటే ఇవి బాగా ఇష్టం (3)
9. క్షీరము (2)
12. 64 అంకె చూడగానే గుర్తొచ్చేవి (3)
13. పిల్లలు మట్టితో చేసేవి (3)
17. మేలు (2)
18. చక్కదనం (3)
19. వాయువు (2)
22. మొలకెత్తిన విత్తులు అటునుంచి (4)
23. ఉబలాటం (4)

1		2		✿	3	4		5
	✿		✿	6	✿		✿	
7		✿	8			✿	9	
	✿	10	✿		✿	11	✿	
✿	12			✿	13			✿
14	✿		✿	15	✿		✿	16
17		✿	18			✿	19	
	✿	20	✿		✿	21	✿	
22				✿	23			

నిలువు

1. కొండ నుంచి వచ్చే ఏరు (4)
2. నాలుగోవంతు తలకిందులు (2)
4. తప్పెట (2)
5. చంద్రునికి చుట్టాలు.. రాత్రులు వికసించేవి కింది నుంచి (4)
6. పాడుకొనేవి (3)
10. తాటాకులో చివరలేదు (3)
11. శాఖలు (3)
14. స్నేహం చేసేవారు (4)
15. కవిత్రయంలో రెండోవాడు (3)
16. దారంతో ఎగిరే పటం (4)
20. ధర (2)
21. దండ (2)

గతవారం జవాబులు

1 పి	ల్లి	2 మొ	గ్గ	✿	3 శ	4 ని	వా	5 రం
పీ	✿	క్క	✿	6 తె	✿	శ	✿	గ
7 లి	క్కి	✿	8 అ	నా	టి	✿	9 వా	రిం
కం	✿	10 పీ	✿	లి	✿	11 ద్వి	✿	చు
✿	12 మ	ను	వు	✿	13 పా	ప	డు	✿
14 ల	✿	గు	✿	15 వా	✿	ద	✿	16 అ
17 ఘు	వు	✿	18 గా	య	ని	✿	19 స్ప	ర్థ
కో	✿	20 ర	✿	సం	✿	21 ఆ	✿	రా
22 ణం	21 బా	మ	రా	✿	23 సం	కు	రా	త్రి

సుడోకు

3		4		1	8	5		9
1				6	4			
	8	2						
	1				6	9	4	
	9	6						
			7		1	6	3	
	2			5	3			
	5	7	9				8	
						4		

1	6	5	3	4	8	2	7	9
7	2	8	5	6	9	3	4	1
9	3	4	2	7	1	6	5	8
8	4	6	9	2	5	1	3	7
2	1	9	4	3	7	8	6	5
5	7	3	8	1	6	4	9	2
3	8	7	6	5	2	9	1	4
4	9	1	7	8	3	5	2	6
6	5	2	1	9	4	7	8	3

లెక్కించండి

□	+	□	=	24
+		+		
□	-	□	=	24
24		24		

1 పజిల్



2 పజిల్

ఈ పజిల్స్‌కి జవాబులు వచ్చేవారంలో ....

గతవారం జవాబులు

1 పజిల్‌కు సమాధానం
మొదటి వరుసలో 9.9, రెండవ వరుసలో 9.9, చివరి వరుసలో చివరి గడిలో (36)
2 పజిల్‌కు సమాధానం (14 1/2)

ఊరు చెబితే.. వినండి!

సరే... సెలవులు వచ్చేశాయ్!

ఇప్పుడు ఏం చేస్తున్నారు మరి?

అమ్మమ్మ, నాన్నమ్మ ఊరెళుతున్నారా? తాతయ్యతోనో, మావయ్యతోనో కలిసి ఊరంతా చుట్టేయండి మరి! పిల్లలకు, అమ్మమ్మలకు ఉన్న సంబంధం లాంటిదే పట్టణాలకు, పల్లెటూళ్లకూ ఉంటుంది. అమ్మమ్మ, నాన్నమ్మ మనవళ్ల కోసం ఎదురు చూసినట్టే– ఊరు కూడా పట్టణాలకు వెళ్లిన తన పిల్లల కోసం నిరీక్షిస్తూ ఉంటుంది. అంటే ఊరు అమ్మమ్మ లాంటిది, నాన్నమ్మ లాంటిది అన్నమాట! ఈ బంధం గురించి ఇంకొంచెం వివరంగా తెలుసుకునే పనిచేయండి.

పట్టణాలకు వచ్చే పాలు, బియ్యం, కూరగాయలు, పండ్లు వంటివి అన్నీ పల్లెటూళ్ల నుంచే ఎగుమతి అవుతాయి. మరి ఇవి పల్లెటూళ్లో ఎక్కడ ఉంటాయి? రైతులు ఆవులు, గేదెలు వంటి పాడిపశువులను పెంచుతారు. దాణా, పచ్చిగడ్డి వంటి బలవర్ధకమైన ఆహారం పెడితే– అవి పాలిస్తాయి. ఆ పాలను డెయిరీలు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు సేకరిస్తాయి. అక్కడ లీటరు పాల ధర ఎంత ఉంటుందో తెలుసా? మీరు పట్టణంలో కొనే అరలీటరు పాలప్యాకెట్టు ధర కన్నా తక్కువ ఉంటాయి. అంటే మనం చెల్లించే డబ్బుల్లో సగమే రైతుకు చేరతాయి. మరి మిగతా ఏమవుతాయి? ఎవరి దగ్గరకు వెళతాయి? సరదాగా పరిశీలన చేయండి. ఈ సాయంత్రం పల్లెటూళ్లో రైతులు పాలు అందిస్తే– అవి వివిధ ప్రక్రియలను దాటుకుంటూ.. ప్యాకెట్లుగా తయారై తెల్లారికల్లా పట్టణాల ముంగిట్లోకి చేరతాయి.

కూరగాయల సేకరణ ఎలా జరుగుతుందో చూడండి. వీలైతే అవి పండే తోటలకు వెళ్లండి. నీరు సరిగ్గా దొరకని సమయాల్లో కూడా వాటిని పెంచటానికి ఎంతో తపన పడుతూ రైతులు కనపడతారు. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ పంటలను రక్షించే రైతులు, వ్యవసాయ కార్మికులు దేశానికి అన్నం పెట్టే అమ్మలాంటివారు. వారు అంత తపిస్తేనే మనకు తిండి అందుతుంది. తోటలోకి వెళ్లి ఒక కేజీ కూరగాయలు సేకరించే పనిచేయండి. దొండకాయలు అయితే– ఆకుల చాటున జాగ్రత్తగా చాలాసేపు వెతకాలి. వంగతోటలో అయితే ఆకులు తగిలి కాళ్ల దురద పెడతాయి. ప్రతి చెట్టుకూ పూత, పిందె, వివిధ దశల్లో ఉన్న కాయలు ఉంటాయి. దేనిని కోయాలి? దేనిని కోయకూడదు? తెలుసుకోవాలి. కాయకోస్తున్నప్పుడు పూత రాలకూడదు. కొమ్మలకు నష్టం కలక్కూడదు. మొరటుగా కనిపించే రైతు జీవితంలో గొప్ప సున్నితత్వం కూడా ఉంటుంది. వంగ, బీర, దొండ, బెండ కాయల్లో ఏవి ముదరవో, ఏవి లేతవో చూసీచూడగానే వాళ్లు చెప్పేస్తారు. అదెలాగో గమనించండి.

ఒక కేజీ కాయకూరలు సేకరించటానికి చాలాసేపు వెతకాలి. కోయదగ్గ కాయ కనిపించినప్పుడు చాలా ఆనందం కలుగుతుంది. అనుభవించండి. సరే.. ఒక కేజీ కూరగాయలకు ఎంత ధర వస్తుందో రైతును అడగండి. ఇంట్లో మీరు ఎంతకు కొంటారో నాన్నను అడగండి. రెంటి మధ్య ఉన్న తేడా డబ్బు ఎవరికి వెళుతుంది?

ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ తోటల్లో బోలెడు సీతాకోకచిలుకలు, ఇతర కీటకాలూ అలా తిరుగుతూనే ఉంటాయి. ఉడతలు, పక్షులు నచ్చిన కాయలను భోంచేస్తూ ఉంటాయి. ఆ కీటకాలకు, పంటలకు ఉన్న సంబంధం ఏమిటి? మాస్టారిని అడిగి తెలుసుకొండి. గ్రామాల్లో మీరు స్వయంగా ఒక తోటను చూసినా, చేలలో తిరుగాడినా గొప్ప బోటనీ పాఠం కళ్లారా విన్నట్టే! మనసారా గ్రహించినట్టే! అందుకే అమ్మమ్మ వాళ్ల ఊరు వేసవి విడిది మాత్రమే కాదు; ప్రత్యక్ష పాఠశాల కూడా! ఊరిని లోతుగా పరిశీలించే పిల్లలు మంచి పౌరులు అవుతారు. నిజం! ★

వేసవి వస్తుందంటే–
అందరికీ ఎండలు గుర్తొస్తాయి.
పిల్లలకు మాత్రం సెలవులు
గుర్తొస్తాయి. సెలవుల్లో చేయాల్సిన
సాహసాలు గుర్తొస్తాయి. వెళ్లాల్సిన ఊళ్లు
గుర్తొస్తాయి. ఆడాల్సిన ఆటలు గుర్తొస్తాయి.
ఆదివారం సెలవు అంటేనే బోలెడు సరదా. మరి
ఆదివారం నుంచి సోమవారం దాకా ..
అలాంటి వారాలు అనేకం వరుసగా ...
సెలవులే సెలవులు అయినప్పుడు–
ఎంత ఆనందంగా ఉంటుందో
కదా!

పర్యాటక ప్రాంతాలంటే- తాజ్‌మహల్లో, చార్మినారో కానక్కర్లేదు. కొత్త విషయాలను చెప్పే ప్రాంతాలన్నీ మనం చూడదగ్గవే! వినదగ్గవే! అలా అనుకున్నప్పుడు- మన చుట్టుపక్కల కూడా అలాంటి ప్రదేశాలు చాలానే ఉంటాయి. ఓసారి అలా చుట్టుపక్కల చూసి రావటం కూడా బాగుంటుంది. స్థానిక సందర్శనలో మన సొంత అనుభూతిని జోడించుకోవటం ఇంకా బాగుంటుంది.

చుట్టుపక్కల చూసొద్దాం!

ప్రకృతి అందాలకు పెట్టింది పేరు అరకు. చుట్టూ పచ్చదనంతో చూడముచ్చటగా ఉంటుంది. అందుకనే చాలా ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. ఇది విశాఖ జిల్లాలో ఉంది కదా! ఆ జిల్లాలోని 70 శాతం మంది అరకును చూసి ఉండరు. మనకు దగ్గర్లోనే ఉంది కాబట్టి- అది గొప్ప ప్రత్యేకం కాదులే అన్నది దీనికి ఒక కారణం కావొచ్చు. అరకు అనే కాదు; ఏ ప్రాంతం అయినా అంతే! పెరటిమొక్క వైద్యానికి పనికి రాదన్నట్టు – స్థానిక ప్రదేశాల సందర్శన పట్ల చాలామంది ఆసక్తి చూపరు. మీరు మాత్రం అలా చేయకండి. పెద్దల సాయంతో చుట్టుపక్కలు చుట్టేయండి.

మీకు దగ్గర్లోనే 400 ఏళ్ల క్రితం నాటి ఆలయం ఉండొచ్చు. అది మీకు చాలా చరిత్రను చెప్పొచ్చు. ఆ కాలంలో ఎవరు పాలించారు? ఏఏ సంఘటనలు జరిగాయి? అప్పటి శిల్పకళ ఎలా ఉండేది? ఆచార వ్యవహారాలు ఎలా సాగేవి? ఇలాంటివి ఎన్నో తెలుస్తాయి.

మీ ప్రాంతంలోనే పండే ఒక ప్రత్యేక పంట ఒకటి ఉండొచ్చు. ఆ వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లండి. అక్కడే ఎందుకు పండిస్తారు? ఆ నేలలు ఎందుకు అనుకూలం? ఆ పంట ఎలా పండిస్తారు? ఎక్కడికి పంపిస్తారు? ఎందుకు ఉపయోగిస్తారు? రైతుల ఆదాయ వ్యయాలు ఎలా ఉన్నాయి?

మీ ఊరి పేరు చెబితే నోరూరించే వంట ఒకటి ఉంటుంది. మాడుగుల హల్వా, కాకినాడ కాజా, ఆత్రేయపురం పూతరేకులు, నూజివీడు మామిడిపళ్లు, తిరుపతి లడ్డూ, అన్నవరం ప్రసాదం ... ఇలా ఏవైనా ఉండొచ్చు. అది ఎలా చేస్తారో, తొలుత ఎవరు చేశారో, ఎలా పాపులర్ అయిందో, ఎక్కడివరకూ విస్తరించిందో... ఇత్యాది విషయాలన్నీ మీ స్థానికీయ విజ్ఞానాన్ని కచ్చితంగా పెంచుతాయి.

మీ ఊరికి దగ్గర్లోనే తప్పెటగుళ్ల కళాకారులు ఉండొచ్చు. తంబూర కథకులు ఉండొచ్చు. హరిదాసు ఉండొచ్చు, బుర్రకథా కళాకారులు ఉండొచ్చు. తోలుబొమ్మల తయారీదారులు ఉండొచ్చు. జానపద గీతాలు అద్భుతంగా పాడే అప్పాయమ్మో సుబ్బారాయుడో ఉండొచ్చు. వెళ్లి కలవండి. మాట్లాడండి. బోలెడు సంగతులు తెలుస్తాయి. ఆదరణ ఒకప్పుడు ఎలా ఉండేది? ఇప్పుడెలా ఉంది? జానపద కథల గురించి తెలుసుకోవటమంటే- మన పూర్వ తరాల గురించి తెలుసుకోవటమే! వారి దగ్గర వాయిద్య సాధనాలు చూడండి. వాటిని వారే స్వయంగా తయారు చేసుకుంటారు. వాటి ప్రత్యేకత ఏంటో తెలుసుకోండి.

రాజమహేంద్రవరం మున్సిపల్ కార్యాలయం, ఆవరణలో ఒక అరుదైన చెట్టు ఉంది. బ్రిటీషు కాలంలో నాటారట! ఇప్పటికీ ఉంది. అలాంటి చెట్టు ఇంకెక్కడా లేదు. అలాంటివే మీ దగ్గరా ఉండొచ్చు. వాటి కథా కమామిషూ కనుక్కోండి. ఎవరో ఒక స్వాతంత్ర్య సమరయోధుడు మీ ప్రాంతంలో తిరుగాడి ఉంటాడు. అల్లూరి సీతారామరాజు కూర్చొన్న పంచాయతీ రాయి పాత కృష్ణాదేవి పేటలో ఉంది. ఆయన స్నానం చేసిన వాగు అక్కడికి దగ్గర్లోనే ఉంది. ఇలా ఒక్కో ఊరిలో ఒక్కో వీరుడు.. ఒక్కో ప్రాంతంలో ఒక్కో వీరోచిత గాథ. పెద్దలను అడిగి వినండి. పరిరక్షణలో ఉన్నా, లేకున్నా ఆ ప్రాంతాలను సందర్శించండి. తడిమిచూడండి. తరచి తరచి ఆ కథలను తలచి చూడండి. మనసు ఎంత పరవశిస్తుందో! ఒకానొక చారిత్రిక కాలంతో కరచాలనం చేసిన అనుభూతి కలుగుతుంది. ఆస్వాదించండి.

మీ ఊరి పక్క మెట్ట, ఆ పక్కనే ఉన్న వాగు, వందేళ్ల నాటి చింతచెట్టు, పాత తరం కబుర్లను పుంఖానుపుంఖాలుగా చెప్పే పెద్దయ్య, ఊరవతలి గుహ, అందులోని దెయ్యాల కత ... అన్నీ అన్నీ చూడదగ్గవే! తెలుసుకోదగ్గవే! మన దగ్గర్లోని ప్రాంతాల్లో మనదైన గతం, వర్తమానం ఉంటాయి. అందుకనే అవి గొప్ప గొప్ప సందర్శనా స్థలాల కన్నా గొప్ప అనుభూతిని కలిగిస్తాయి. మనలోకి మనల్ని కదిలిస్తాయి. మరి ఇంకెందుకు ఆలస్యం? పెద్దల సాయంతో కదలండి. ★

వేసవి శిబిరాల్లో ఏం నేర్చారు?

అనేక కారణాల వల్ల సెలవుల్లో అందరికీ అమ్మమ్మ వాళ్ల ఊరెళ్లటం సాధ్యం కాకపోవొచ్చు. ఒకవేళ వెళ్లినా నాలుగైదు రోజులకే పరిమితం కావొచ్చు. పట్టణాలూ, నగరాల్లో అయితే- రోజూ ఎలా గడపాలో పాలుపోదు. అందుకనే- కొన్నేళ్ల నుంచి పట్టణాల్లో, నగరాల్లో వేసవి శిబిరాలు నడుస్తున్నాయి. మరి అందులో ఏం నేర్చుకుంటున్నారు?

వేసవి శిబిరాల లక్ష్యం ఏమిటి? ఏమిటంటే- పిల్లలు స్కూల్లో ఏమి నేర్చుకోరో వాటిని నేర్పటం, పరిచయం చేయటం! లేదంటే- తరగతిలో మరింత మెరుగ్గా నేర్చుకోవటానికి వీలుగా నైపుణ్యాలు పెంచటం! లేదంటే- ఆసక్తి గల ఆటలనో, పాటలనో మరింతగా సాధన చేయడం! ఇలా నేర్చుకునేది ఏదైనా- అది సరదా సరదాగా సాగిపోవటం ఓ అంతస్సూత్రం. వేసవి శిబిరాలు కూడా వొట్టి శిక్షణలాగా, శిక్షలాగా సాగితే పిల్లలకు అది కూడా బోరు కొడుతుంది. అందుకనే ప్రత్యేకించి వేసవి శిబిరాలను ఆటపాటల కలయికగా నడుపుతారు. చదువు మరింత సులభంగా సాగటానికి సెలవుల్లో దొరికే జీవన నైపుణ్యాలు కొంత ఉపయోగపడతాయి. మెలకువలు తెలుస్తాయి.

వేసవి శిబిరాల నిర్వహణ రెండు పద్ధతుల్లో జరుగుతుంది. **ఒకటి :** బాలల వికాసం పట్ల తపన ఉన్న కొన్ని సంస్థలు ఉచితంగానే ఈ శిబిరాలను నిర్వహిస్తున్నాయి. వీటికి చాలా స్పందన ఉంది. విజయవాడలోని ఎంబి విజ్ఞానకేంద్రంలో అమరావతి బాలోత్సవ కమిటీ నిర్వహిస్తున్న ఉచిత శిబిరం పిల్లలతో కోలాహలంగా సాగుతోంది. అలాగే విశాఖలో విసిసి ఆధ్వర్యాన చాలాకాలంగా ఇటువంటి శిబిరాలు నడుస్తున్నాయి. గ్రంథాలయాలు, స్థానిక సంస్థల ఆధ్వర్యాన కూడా వేసవి శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు.

రెండోది : ఇలా కాక 10 లేదా 15 రోజులకు ఇంత ఫీజు అనే పద్ధతిలో ఆటలు, సంగీతం, అబాకస్ తదితర అంశాల్లో శిక్షణ కోసం ప్రయివేటు సంస్థలు, వ్యక్తులూ సమ్మర్ క్యాంపులు నడపటం. ఇవి అన్ని పట్టణాల్లో, నగరాల్లో నడుస్తున్నాయి. పిల్లల ఆసక్తిని బట్టి, పెద్దల వెసులుబాటును బట్టి వీటిలో చేర్చాల్సి ఉంటుంది.

అభిరుచికి అంకురార్పణ

ఈ వేసవి శిబిరాలు వివిధ అంశాల పట్ల ప్రాథమిక ఆసక్తిని కలిగించటానికి ఉపయోగపడతాయి. ఎంతోకొంత తర్ఫీదును కూడా ఇస్తాయి. అది తరువాత కొనసాగించే సాధనకు, ఆలోచనకు పునాది అవుతుంది. ఒక శిబిరంలో కథలు చదవడం, రాయటం, చెప్పటం; బొమ్మలు గీయటం, అప్పటికప్పుడు ఇచ్చిన అంశంపై మాట్లాడటం.. వంటివి పరిచయం చేయొచ్చు. ఆటల్లో, లెక్కల్లో, భాషలో మెలకువలు నేర్పొచ్చు. వ్యక్తిత్వ వికాసాన్ని పరిచయం చేయొచ్చు. ఇలా ఏవి చెప్పినా ఆ అంశంలో ప్రాథమిక పరిజ్ఞానమే అవుతుంది. ఆసక్తి ఉంటే- దాని కొనసాగింపు ఆ తరువాత కూడా కొనసాగించాలి. వేసవి శిబిరాల్లో నిపుణులైన అధ్యాపకులు, వివిధ రంగాల్లోని నిష్ణాతులు పరిచయం అవుతారు. తరువాతి కొనసాగింపునకు, అవసరమైన గైడెన్సుకు వారు ఉపయోగపడొచ్చు.

మేలిమిత్రుల కలయిక

ఒకే రకమైన ఆసక్తి, అభిలాష ఉన్నవారు ఇలాంటి, శిబిరాల్లో తారసపడతారు. ఆ పరిచయం, స్నేహం భవిష్యత్తులోనూ ఉపయోగపడుతుంది. గొప్ప గొప్ప క్రీడాకారుల స్నేహాలు స్కూల్లో కాదు; ఇలాంటి శిబిరాల్లోనే మొదలయ్యాయి. ఒకే ఆసక్తి ఉన్నవారు తరగతి గదిలో ఉండకపోవొచ్చు. శిక్షణాశిబిరాల్లో మాత్రం కచ్చితంగా దొరుకుతారు. పిల్లల ఆసక్తులు ఇలాంటి చోట పురివిప్పే అవకాశం ఉంది. తాము ఎందులో రాణిస్తామో, దేనిపట్ల సంతోషాన్ని కనపరుస్తామో ఇక్కడ అవగాహనలోకి వచ్చే అవకాశమూ ఉంది.



వేసవిశిబిరాల్లో నేర్చుకునేవి చాలామందికి వృత్తి ఎంపికకు దారితీయకపోవొచ్చు. కానీ, ఏదొక వృత్తికి అనుబంధంగా మనసు కోసం, సంతోషం కోసం ఎంచుకునే అభిరుచులకు ఇక్కడ బీజం పడుతుంది. అది షటిల్ కావొచ్చు, చెస్సు కావొచ్చు. కథారచన కావొచ్చు, చిత్రలేఖనం కావొచ్చు. సంగీతం కావొచ్చు, డ్యాన్సు కావొచ్చు. ఇలా ఇలా .. ఇంకేమైనా కావొచ్చు. అది కచ్చితంగా మన మనసుకు సంతోషాన్నిచ్చే సాధనం అవుతుంది. బిజీబిజీ భవిష్యత్తులో ఓ చక్కని ఆలంబన అవుతుంది. పదీ, పదిహేను రోజుల శిబిరాలే కావొచ్చు.. అవే 70, 80 ఏళ్ల జీవితానికి ఆనందాన్నిచ్చే ఓ హాబీకి అంకురార్పణ అవ్వొచ్చు!

వేసవి తెచ్చిన కానుకలెన్నో..!

కాలం ఏదైనా సరే.. అందుకు తగినట్టుగా ప్రకృతి ఏర్పాట్లు చేస్తుంది. ఒక ఇబ్బంది కలిగినచోట ఒక సదుపాయం కూడా ఉంటుంది. ఒక సమస్య ఉత్పన్నమైనచోట ఒక పరిష్కారం కూడా ఉంటుంది. వేసవి కూడా అంతే! ఎండలు, ఉక్కపోతలూ తెస్తుంది. అదే చేత్తో తీయని పుచ్చకాయలు, చల్లని ముంజెకాయలూ ఇస్తుంది. హాయిగొలిపే మల్లెపూలూ అందిస్తుంది. ఎండను భరించినట్టే- అది అందించే ప్రత్యేకతలనూ ఆస్వాదించేద్దాం మరి!

ఎండలు భగభగమండే కాలం. మాటమాటకీ దాహం గొంతెత్తే కాలం. గుక్కెడు మంచినీళ్ల గగనమయ్యే కాలం.. అలాంటి కాలంలో నిండా తీయని నీరు నింపుకున్న పెద్ద పుచ్చకాయ దొరుకుతుంది. నమిలే పనిలేకుండానే కమ్మని రుచిని, చల్లని నీటిని నోటికి అందిస్తుంది. వేసవిలో కాక ఇంకే కాలంలో దొరుకుతుంది ఇంత చక్కనీ పుచ్చకాయ! దొరికితే మాత్రం ఇప్పుడున్నంత ఆస్వాదన, ఆనందం అప్పుడు ఉంటుందా? ఉండదు కాక ఉండదు. ఘుమఘుమలాడే పనస తొనలు వేసవిలోనే ఊరిస్తాయి. కమ్మని వాసనతో తీయతీయగా ఆహ్వానిస్తాయి. ఎండల దండు వస్తుందీ అంటే- పనసపండు తినేసి పోదాం అన్నట్టే ఉంటుంది.

ఇక తాటిముంజెల సందడి కూడా వేసవిదే! చెట్టెక్కి, గెలలను దించటం, ఒడుపుగా కాయను నరకడం గ్రామీణులకే సాధ్యమైన కళ. తాటికాయ నుంచి నీటిని, గుజ్జునూ చేతివేలితో లాక్కోవటం కూడా ఓ విద్య. అందరికీ అలా తినటం సాధ్యం కాదు. వొలిచిన ముంజెలను తినటం కాదు; చల్లని చెట్టు కింద కూచొని కాయలను జుర్రుకోండి. అప్పుడు తెలుస్తుంది అసలైన తాటి-రసాస్వాదన!

జీడిపళ్లకు కూడా ఇదే సీజను. పచ్చిగా ఉన్నవి తింటే గొంతు పట్టేస్తుంది. బాగా పట్టిన వాటిని ఎంపిక చేసుకొని, తింటే అదొక అనుభూతి! ఇంకా కర్బూజాలు, దోసకాయలు, నిమ్మకాయలు, కొబ్బరి బోండాలు, చెరకుగడలు దాహార్తిని తీర్చే గొప్ప ఉపశమనాలు. పోషకాలతో కూడిన ప్రకృతి ప్రసాదాలు. ఇంకా ఊరి బాటలో నడిచిపోతుంటే- దారిపక్కన చిన్న చిన్న పళ్ల ఏవొకటి ఊరిస్తూ ఉంటాయి. పరిమిపళ్ల, పాలపళ్ల, పిసికిన పళ్ల తారసపడతాయి.

వేసవి ప్రసాదించే ప్రత్యేక ఫలం మరొకటి ఉంది. మీకు బాగా తెలిసిందే! ఈపాటికే చవిచూసే ఉంటారు.. అదే మధురఫలం మామిడి. రసరాజు. పండ్లకు రారాజు. రుచికి మహారాజు. వేసవిలో ఎక్కడబడితే అక్కడ విస్తారంగా దొరుకుతాయి. అందులో రకరకాలు. రసాలు, బంగినపల్లి, నూజివీడు, నీలం, కలెక్టరు, సన్నాకుల రకం.. ఇలా! ఎన్నయినా తినొచ్చు. ఎంతైనా ఆస్వాదించొచ్చు. దాహమే కాదు; ఆకలి కూడా ఉండదు. వేసవి ఉత్తి ఎండలతోనూ, ఉక్కపోతతోనూ రాదు. బోలెడు బోలెడు పండ్లూ, ఫలహారాలు నెత్తిన పెట్టుకొని వస్తుంది, వచ్చింది.

బాలనేస్తాలూ, ఈ వేసవి తెచ్చిన అన్ని రకాల పండ్లూ తినండి. అన్ని ప్రత్యేకతలూ ఆస్వాదించండి. సాయంత్రం వేళ చల్లగాలులను మీ వొంటికి తగలనివ్వండి. చిరుచిరు చెమట్లు శరీరాన్ని కమ్ముతున్నప్పుడు- ఓ చల్లని చిరుగాలి స్పర్శిస్తే ఎంత హాయిగా ఉంటుందో అనుభవించండి. కష్టం సుఖం, వేడీ చల్లన అనేవి జంటపదాలే కాదు; ఒకదానికొకటి అందాన్ని, గౌరవాన్ని తెచ్చే సందర్భాలని కూడా గుర్తించండి. మొత్తంగా వేసవికాలాన్ని చల్లచల్లగా గడిపేయండి.

- సత్యాజీ
94900 99167





యాప్‌ల్లో చదువులు

నేటి కాలంలో పిల్లలు అత్యధికంగా ఉపయోగించే సాధనం ఏదైనా ఉందంటే అది స్మార్ట్‌ఫోన్ అని టక్కున చెప్పొచ్చు. ప్రస్తుతం పాఠశాలలకు సెలవులు ఇచ్చేశారు. సెలవు రోజుల్లో ఆసక్తి ఉన్న పిల్లలు లెర్నింగ్ యాప్స్ ద్వారా వారికిష్టమైన అంశాన్ని ఎంచుకుని అందులోని ఎన్నో విషయాలను తెలుసుకోవచ్చు. ఆసక్తిని, ఇష్టాన్ని పెంచే యానిమేషన్ తేలిగ్గా అర్థం చేయించే విజువల్స్, టెక్నిక్స్‌తో ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, పిల్లల మెదడుకు పదునుపెట్టే అనేక యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. అటువంటి కొన్ని యాప్‌ల గురించి తెలుసుకుందాం..!

ఆకాశంలో చూసిన చందమామ, పాలపుంతల గురించి, మనం ఉండే భూమి గురించి తెలుసుకోవాలనుకునే జిజ్ఞాసవంతులకు సామాజిక మాధ్యమంలో అందుబాటులో ఉంది యూట్యూబ్. పిల్లలకు ఆసక్తి గొలుపుతూ, మెదడుకు పదును పెంచే అనేక యానిమేటెడ్ యాప్స్ పిల్లల కోసం ఎన్నో ఉన్నాయి. వాటిని పక్కన పెట్టి ఆన్‌లైన్ ఆటలపై దారి మళ్లుతున్నారు నేటి పిల్లలు. వారిని దారిలోకి తీసుకురావల్సిన బాధ్యత ప్రధానంగా తల్లిదండ్రులపైనే ఉంది. వారెంత బిజీగ్గా ఉన్నా అటువంటి ఫ్రీ యాప్‌లను గుర్తించి పిల్లలను దగ్గరుండి గైడ్ చేయవచ్చు.

పదును పెంచే ఆటలు..

మీకు లెక్కలంటే మహా ఇష్టమా? బ్రెయిన్‌కు పదును పెట్టే లెక్కలను అవలీలగా చేయాలనుకుంటున్నారా? 'మ్యాథ్స్ జీనియస్ బ్రెయిన్ టీజర్' 'బ్రెయిన్ ఏజ్ గేమ్' 'లాజిక్ టీజర్' 'మెమొరీ టీజర్' వంటివి అనేక ఆన్‌లైన్ ఫ్రీ గేమ్స్ అందుబాటులో ఉన్నాయి. అంతేకాదు, వీటిల్లో లెవల్స్ కూడా ఉంటాయి. మీ వయసు ఆధారంగానే మీకు ప్రశ్నలు, మీ బ్రెయిన్‌కు పరీక్షలుంటాయి. సరైన సమాధానాలిస్తుంటే స్థాయిని పెంచుకుంటూపోతాయి. ఇటువంటి గేమ్స్‌ను ఆడుకోవడం వల్ల ఎంతో సులువుగా లెక్కలను చేయగలుగుతారు. లాజికల్‌గా ఆలోచించగలుగుతారు.

జీవితంలో ఎటువంటి కష్టాన్నైనా ఎదుర్కొనే మానసిక స్థితికి ఎదుగుతారు. పిల్లలతోపాటు పెద్దలూ వీటిని చేస్తుంటే వారూ ఆ దారిలోనే పయనిస్తారు. కానీ, పిల్లలను పెద్దలను దారిమళ్లించే వీడియోలు మధ్య మధ్యలో వస్తుంటాయి. ఇక్కడే. చిక్కంతా మొదలైయ్యేది. ఇది మరో కోణమనే చెప్పాలి. అందుకు మీ పిల్లలు మీ పర్యవేక్షణలోనే వీడియోలను చూసేందుకు అనుమతిని ఇవ్వండి లేదంటే మీ పిల్లలు అడల్ట్ వీడియోలకు బానిసలుగా మారే ప్రమాదం ఉంది. పిల్లలు ఏ దారిలో వెళ్లాలనేది తల్లిదండ్రుల చేతుల్లోనే ఉంటుందనేది ముందుగా పెద్దలూ గ్రహించాల్సిన విషయం.

ఫన్ చదువుల యాప్...

ఆటలంటే పిల్లలకు మహా ఇష్టం. ఆడుతూ పాడుతూ విజ్ఞానాన్ని పెంచే ఫ్రీ యాప్‌లు వారికోసం ప్రత్యేకంగా వచ్చాయి. 'ఫన్ ఎడ్యుకేషన్ యాప్' 'బెస్ట్ ఫ్రీ ఎడుకేషన్ యాప్' 'ఏబీసీ యాప్' 'ప్లే అండ్ లెర్న్ యాప్' వంటి పేర్లతో ప్రీ స్కూల్ చిన్నారుల కోసం రూపొందించారు. ఈ యాప్‌ల్లో పిల్లల కోసం ఏబీసీడీలనూ, నెంబర్లనూ, కలర్స్‌నూ, వారాల పేర్లనూ, నెలల పేర్లనూ, రైమ్‌లను వారిచేత ఆడుకుంటూ పాడుకుంటూనే నేర్పిస్తున్నాయివి. అంతేకాదండీ, పిల్లలు అక్షరాలను సులువుగా రాసేందుకు స్కూల్‌కి వెళ్లాక స్ట్రైట్ లైన్, హారిజాంటల్ లైన్, క్రాస్ లైన్ వంటివాటిని నేర్పిస్తాయి. ఈ యాప్‌లలో పిల్లలకు ఎంతో ఇష్టమైన ఐస్‌క్రీమ్, చాక్లెట్, బ్యాట్ బాల్ వంటి బొమ్మలతో తెలుపుతున్నాయి. చిన్నారులకు వృత్తం, కోలాకారం, త్రిభుజాకారం వంటివాటిని నేర్పేందుకు పండ్లతో, కూరగాయలతో చూపిస్తూ వారికి అటు పలికేందుకు వీలుగానూ, ఇటు గుర్తించేందుకు సులువుగానూ ఉండేవిధంగా రూపొందించారు. రాబోయే విద్యా సంవత్సరంలో మీ పిల్లలను బడికి పంపేందుకు ముందుగానే ఈ యాప్‌ల ద్వారా సరదాగా నేర్పించవచ్చు. కానీ, ఒకటి గుర్తుపెట్టుకోండి కట్టడిచేసి చదువును రుద్దకండీ.. ఆడుతూపాడుతూ నేర్పించండి.



కామన్ సెన్స్ పెంచే యాప్స్..

నేటి చదువుల వల్ల పిల్లలు అనేక విషయాలను తెలుసుకోలేకపోతున్నారు. అది సమాజం తప్పే కావొచ్చు. పిల్లలు పెరిగిన వాతావరణం కావొచ్చు. వారి చదువుతున్న స్కూల్ పరిస్థితి వల్లనే కావొచ్చు. ఏదైనా సరే అందుకు బలయ్యేది మాత్రం పిల్లలే. అలా కాకుండా 'కామన్ సెన్స్ మీడియా' వారు అప్పర్ ప్రైమరీ దశ పిల్లల కోసం ప్రత్యేకంగా ఈ యాప్‌ను ముందుకు తీసుకొచ్చారు. ఇందులో పిల్లలు ఇంటి నుంచి బయటకు వచ్చి తిరిగి ఇంటికెళ్లే వరకూ ఎదురయ్యే ఎన్నో విషయాలను రూపొందించారు. ఉదాహరణకు రోడ్డును దాటేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఒక షాపుకు వెళ్లి ఏదైనా కొనుక్కోవాలంటే వ్యవహరించాల్సిన తీరు, లైబ్రరీల్లో ఏవిధంగా ఉండాలి, రోడ్డుపై అనుకోని సంఘటనలు ఎదురైనప్పుడు ఎలా ఎదుర్కోవాలి, వారి రక్షణ వంటి వాటి గురించి క్లుప్తంగా రూపొందించారు. ఈ యాప్ ద్వారా పిల్లలు ఎలా నడుచుకోవాలో అనే అంశాలను సులువుగా తెలుసుకోగలుగుతారు.

కళ్లకు కట్టినట్టుగా...

ఆరు,



నుంచి పదో తరగతి పిల్లలకు సైన్సుకు సంబంధించిన పాఠాలను వివరించేందుకు మన దేశంలో అన్ని పాఠశాలల్లో డిజిటల్ పద్ధతి రాలేదు. కేవలం బొమ్మల ఆధారంగా వివరిస్తున్నారు. కానీ, పిల్లలు సైన్సు పాఠాల్లో బేసిక్స్ నేర్చుకునేది ఈ దశలోనే. అందుకోసం ఆ వయసు వారికి కొన్ని యాప్‌లను రూపొందించారు. 'Scholastic - Science World' వారు సూపర్ సైన్స్, కరెంటు సైన్స్, ఎర్త్ సైన్స్ అని కొన్నింటిని అందుబాటులో ఉంచారు. అందులో వారు మానవ శరీర నిర్మాణం, ఎముకలు, మెదడు పనితీరు, కండరాల పనితీరు, వాతావరణ స్థితిగతులు, కాంతి ప్రయాణం చేసే విషయాలను కళ్లకు కట్టినట్లుగా పొందుపరిచారు. వారికి ఈ పద్ధతిలో చూపిస్తూ తరగతి గదిలో పిల్లలకు వివరిస్తే మరింతగా అర్థం చేసుకోడానికి అవకాశం ఉంటుంది. రాబోయే తరగతుల్లో మరింతగా ఇవి ఉపయోగపడతాయి. కనీసం తల్లిదండ్రులు ఇటువంటి యాప్‌లను స్మార్ట్‌ఫోన్‌లో డౌన్‌లోడ్‌చేసి చూపించవచ్చు. కానీ, ఇంతకు ముందు చెప్పినట్టే పెద్దల పర్యవేక్షణలోనే చేయాలనేది గుర్తుపెట్టుకోండి.

కాస్త సమయం చాలు...

పిల్లల ఎడ్యుకేషన్ కోసం స్మార్ట్‌ఫోన్‌లో అదేపనిగా చూస్తుంటే వారి కంటికి నష్టం కలిగే అవకాశం ఏర్పడుతుంది. అలాకాకుండా వారికి ఏ అంశంపైన ఆసక్తి ఉన్నా వారిని దగ్గరుండి గైడ్ చేస్తూ కొంత నిర్ణీత సమయాన్ని మాత్రమే కేటాయించేలా చూసుకోవాలి. పిల్లలు పడుకోడానికి, తినడానికి, ఆడుకోడానికి, టివి చూడడానికి, సమయాన్ని కేటాయించినట్లే వీటికి కూడా కేటాయించుకోండి. అలా చేయడం వల్ల ఒకే పద్ధతిలో నడుచుకోవడమే కాకుండా డైవర్ట్ అయ్యే ప్రమాదం నుంచి తప్పించిన వారవుతాం.

ట్రై చేయండి..

ప్రస్తుతం పిల్లల నుంచి పెద్దల వరకూ ఫేస్‌బుక్ ఖాతా లేని వారుంటూ లేరు. అయితే ఫేస్‌బుక్ స్క్రోల్ చేస్తుంటే మధ్య మధ్యలో అనేక క్విజ్ ప్రశ్నల పోస్టులు చూస్తుంటాం. మనం వాటిని చాలా ఈజీగా వదిలేస్తాం. అలా కాకుండా ఓసారి ట్రై చేయండి. కష్టమో, సులువో మీకే అర్థమౌతుంది. అంతే కాకుండా పోస్టు చేసిన వారు ఏ సైట్ నుంచి షేర్ చేశారో చూడొచ్చు. తికమక పెట్టే ఆ ప్రశ్నలకు సులువుగా సొల్యూషన్ ఉందేమో! అది ఎలా? అని ప్రశ్నించుకుని సాల్వ్ చేసే ప్రయత్నం చేయవచ్చు. ఆ పోస్టు ప్రత్యేక సైట్ నుంచి కాకుండా వ్యక్తే పోస్టు చేస్తుంటే ఓసారి వారి టైమ్‌లైన్‌లోకి వెళ్లి పరిశీలించండి. ఆలోచింపజేసే ప్రశ్నలు సమాధానాలూ ఇలాంటివే ఉంటే ఫాలో అవ్వొచ్చు. సమాధానం తెలిసిపోయింది కదా! అని ఊరుకోకుండా అది ఎలా వచ్చిందో తెలుసుకుంటే లాజికల్‌గా థింక్ చేయడం అలవాటు అవుతుంది.





మీకంటూ ఓ పేజీ...

మీరు చేసే ప్రయోగాలను అప్‌లోడ్ చేసేందుకు ముందుగా ఫేస్‌బుక్‌నే వేదికగా ఉపయోగించుకోవచ్చు. మీకు ఫాలోవర్స్ పెరిగారనుకోండి అది పేజీగా మారుతుంది. అప్పుడు మీకంటూ పుస్తకంలో ఓ పేజీని తెరిచినట్లే.! ప్రారంభంలో ఎన్నో సందేహాలను తీర్చుకోవచ్చు. అలాగే సైన్సు, లెక్కలకు సంబంధించి మీరు కనిపెట్టిన కొత్త అంశాలను అప్‌లోడ్ చేయవచ్చు. క్లిష్టమైన జిమ్మిక్కుల లెక్కలు తెలిస్తే ప్రశ్నల రూపంలో వేయడం వంటివి మీ ప్రతిభకు గుర్తింపే అవుతుంది. అయితే ఇటువంటివి చేసేప్పుడు పిల్లలకు మాధ్యమాల్లో వచ్చే డౌట్స్‌ను తీరుస్తూ, వారిని ప్రోత్సహించే బాధ్యత తల్లిదండ్రులకే ఉంటుంది. దాన్ని అందిపుచ్చుకుని సెలవుల్లో తమ పిల్లలు ఎన్నో అద్భుతాలను చేయగలరు. ప్రతిభను నిరూపించుకోడానికి ఇదో సదావకాశంగా నిలుస్తుంది.

జయించే సాధనం...

జ్ఞానం ఆనందం, ఆహ్లాదం. వ్యక్తిత్వ వికాసం, సమిష్టి కృషి, మానసిక వ్యాయామంతోపాటు ఒత్తిడి నుంచి జయించే సాధనం. ప్లే గ్రౌండ్‌లో ఆడుకోవాల్సిన పిల్లలు ఆటలకు బదులుగా మొబైల్ గేమ్స్ ఆడుకుని వాటి నుంచి ఒత్తిడికి లోనవడంతో పాటు వాటికి బానిసలు అవుతున్నారు. చేతిలోనే ఉన్న ప్రపంచాన్ని అవసరమైన విధంగా సరైన పద్ధతిలో వాడుకోవడం వల్ల దాని ప్రయోజనం చేకూరుతుంది. మరి ఇటువంటి ఆసక్తికరమైన విషయాలను తెలుసుకోవాలంటే పిల్లలే కాదు, పెద్దలూ మొదలుపెట్టాల్సిందే.!

సామాజిక మాధ్యమాల్లో స్వీయ నియంత్రణ లేకపోతేనే ప్రమాదకర స్థితిలో పడిపోతారు. ఏ సామాజిక మాధ్యమమైనా మంచి కోసం ఉపయోగించుకుంటే ఎవరికీ అభ్యంతరాలు ఉండవు. మీరు చెడిపోతూ మీతో పాటు సమాజాన్ని చెడగొడుతుంటే మాత్రం శిక్షకు సిద్ధంగా ఉండాల్సిందే. అలాకాకుంటే మంచి మార్గంలోనే ప్రయాణం సాగుతుంది.

- వర్ధని



ఉదయం మొదలు రాత్రి వరకు చదువుల భారం మోసి అలసిన పిల్లలు వేసవి సెలవుల్లో అయినా రిఫ్రెష్ కావాలి కదా..! మన ఊరికి పది నుంచి ఇరవై కిలోమీటర్ల దూరంలోనే తోటలు, పొలాలు, అందమైన ప్రకృతి తావులుంటాయి. స్వచ్ఛమైన వాతావరణంలో కేరింతలు కొట్టనిద్దాం. వీలుంటే పచ్చని పొలాలు, కోనసీమ కొబ్బరిచెట్లు, నూజివీడు మామిడి చెట్లు, ఉద్యానవనాలు, జంతు ప్రదర్శనశాలలు, సముద్రతీరాల్లో గాలి పీల్చుకోనిద్దాం. వీలుంటే ప్రకృతి అందాలతో పాటు, చారిత్రక కట్టడాలు, అక్వేరియాలు, మ్యూజియాలు ఇలా ఎన్నో సందర్శనీయ ప్రాంతాలకు తీసుకెళ్లాలి. తల్లిదండ్రులే ఒకింత సమయాన్ని కుదుర్చుకునో, అవకాశం కల్పించుకునో హుషారు యాత్రకు కదలాలి.

ప్రకృతిని చూసొద్దామా..!

ఇంటి ముందు నాలుగు పూలమొక్కలుంటేనే ఎంతో ఆనందంగా ఫీల్ అవుతాము. అదే గ్రామమంతా అందమైన పూల మొక్కలతో నిండి ఉంటే అద్భుతంగా ఉంటుంది. అలాంటిదే మన రాష్ట్రంలో

రాజమండ్రిలోని కడియం. వేలాది పూల మొక్కలు, ఎన్నో రకాల చెట్లతో ఊరంతా పచ్చని బెల్టులా అద్భుతంగా ఉంటుంది కడియం గ్రామం. ఇక్కడ దొరకని మొక్కలంటూ ఉండవు. దేశవిదేశాలకు ఎగుమతి చేస్తారు. ఇలాంటి ప్రాంతాలను చూడటానికి పిల్లలు, పెద్దలు ఇష్టపడతారు.

మ్యూజియం షిప్...

పురాతన వస్తుప్రదర్శనశాలలైన మ్యూజియాలు పిల్లలకు ఎంతో బోధిస్తాయి. 1971లో ఇండోపాకిస్తాన్ యుద్ధ సమయంలో వినియోగించిన కుర్సురా సబ్‌మెరైన్‌ను సందర్శకులకు ప్రదర్శించేందుకు విశాఖపట్నం ఆర్‌కె బీచ్‌లో ఉంచారు. దక్షిణాసియాలోనే తొలి సబ్‌మెరైన్ మ్యూజియంగా పేరుగాంచింది. 2007లో అమెరికా నేవీ వైస్ అడ్మిరల్ కెరాల్ ఎం.పోటెంజర్ దీనిని సందర్శించి అద్భుతమైన అనుభవంగా పేర్కొన్నారు. ఘాజి సినిమాలో కూడా ఇటువంటి సబ్‌మెరైన్‌నే చిత్రీకరించారు. దీని సందర్శన ద్వారా పిల్లలకు నేవీపై అవగాహన కల్పించవచ్చు. ఈ మ్యూజియమే కాక విజయవాడలోని బాపు మ్యూజియం, అమరావతి మ్యూజియం, ఆళ్లగడ్డ శిల్పకళా మందిరం మరెన్నో గతాన్ని వివరించే మ్యూజియాలున్నాయి.

ఇందిరాగాంధీ జూలాజికల్ పార్క్..

దేశంలోనే మూడవ అతిపెద్ద జూ విశాఖపట్నంలోని కంబాల కొండ అడవుల్లో ఉంది. 625 ఎకరాల విస్తీర్ణంలో ఎనభై జాతులకు చెందిన ఎనిమిది వందల జంతువులు ఇక్కడున్నాయి. విశాఖపట్నం రైల్వేస్టేషన్‌కు 11 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. వీటి సందర్శన ద్వారా ఎన్నో జీవులు భూమిపై మనుగడ సాగిస్తున్నాయని పిల్లలు గ్రహించగలుగుతారు. డిస్కవరీ, నేషనల్ జియోగ్రఫీ చానల్స్‌లోనే కనిపించే జంతువులు కళ్ల ఎదుట కనిపిస్తుంటే వారి కేరింతలకు హద్దే ఉండదు. వెంకటేశ్వర జూలాజికల్ పార్క్, హార్స్‌లీ హిల్ జూలు మన రాష్ట్రంలో ఉన్నాయి.

శిలాజాల పార్కులు...

భూమి చరిత్రని జీవపరిణామ క్రమాన్ని వివరించే..చిట్టి బుర్రలకు ఎన్నో ప్రశ్నలు, మరెన్నో సందేహాలు కలిగించే శిలాజాల పార్కుల సందర్శన కూడా పిల్లలకు గొప్ప అనుభూతుల్ని మిగులుస్తుంది. పురావస్తు శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ పార్కులు తప్పకుండా చూడదగినవి. అహ్మదాబాద్‌కు 24 కి.మీ దగ్గరలో ఇంద్రోడా డైనోసార్ పార్క్ ఉంది. దీన్ని జురాసిక్ పార్క్ ఆఫ్ ఇండియా అంటారు. రాక్షసబల్లుల శిలాజాలే కాక ఇక్కడ లైఫ్‌-సైజ్ డైనోసార్ల మోడళ్లున్నాయి. మధ్యప్రదేశ్‌లోని 'ఘుగువా ఫాజిల్ పార్కు'లో 65 లక్షల సంవత్సరాల క్రితం నాటి చెట్లు, ఆకులు, కాయలు, గింజలు, ఆల్‌చిప్పల శిలాజాలు ఉన్నాయి. వీటిలో తాటి చెట్టు శిలాజం ప్రముఖమైనది. కోల్‌కతాలోని ఐఎస్ఐ జియోలాజికల్ మ్యూజియంలో 47 అడుగుల డైనోసార్ అస్థిపంజరం కనిపిస్తుంది. ఇంత పెద్ద అస్థిపంజరాన్ని చూసిన పిల్లలు ఎంతో ఆశ్చర్యానికి గురౌతారు. ఇంకా మనదేశంలో ఇలాంటివి మండ్ల, శివాలిక్, వుడ్ వంటి జాతీయ శిలాజాల పార్కులు కూడా ఉన్నాయి.

వావ్ అక్వేరియం..

నీటిలో విహరించే చేపలను చూడటానికి పిల్లలెంతో ఇష్టపడతారు. అలాంటి వారి కోసం వైజాగ్ బీచ్ రోడ్‌లో ఉన్న 'మత్స్యదర్శిని' అక్వేరియం మంచి ఆహ్లాదాన్ని అందిస్తుంది. సముద్రాల్లోని మత్స్య సంపదను ప్రదర్శనగా ఉంచారు. సింగపూర్, శ్రీలంక, మలేషియా ఇతర ప్రాంతాల నుంచి చేపలను తెచ్చి ఇక్కడ

పెంచుతున్నారు.

చారిత్రక ప్రదేశాలు...

ఆనాడు కట్టిన కట్టడాలు చరిత్రకు గురుతులు. సాంఘిక శాస్త్ర పఠనంలో తప్పక చూడాల్సిన ప్రదేశాలు ఈ చారిత్రక కట్టడాలు. మన రాష్ట్రంలో అనేక పురాతన కట్టడాలున్నాయి. ఉండవల్లి గుహలే కాక మరెన్నో గుహలున్నాయి. కొండపల్లి కోట, కొండారెడ్డి కోట, అనంతపురంలోని గూటీ కోట, రాయదుర్గం కోట, అమరావతి, హేమావతి, వైజాగ్ దగ్గరలోని బావికొండ, తొట్లకొండ వంటి చారిత్రక ప్రదేశాలు చూడదగినవి.





చిక్కు లెక్కలు I

1. ఉస్మాన్ అనే రైతుకు చతురస్రాకారంలో ఉన్న పొలం ఉంది. దానిలో చెరకుతోట వేశాడు. అడవి పందులకు చెరకు అంటే చాలా ఇష్టం. రాత్రివేళ అవి తోటలోకి వచ్చి తినేయకుండా పొలం చుట్టూ కంచె వేయాలని అనుకున్నాడు ఉస్మాన్. పొలానికి ఒకపక్క కంచె వేయటానికి 53 సిమెంటు స్తంభాలు అవసరం అవుతాయి. మరి నాలుగు పక్కలా కంచె వేయాలంటే- మొత్తం ఎన్ని స్తంభాలు అవసరమవుతాయి?

2. చక్కగా ముస్తాబై ఓ పార్టీకి వెళుతున్న కప్ప తొందర్లో ఒక 15 అడుగుల లోతున్న గొయ్యిలో పడిపోయింది. అది చాలా బురదగా, జారుడుగా ఉంది. పైకి రావటానికి కప్ప చాలా ప్రయత్నం చేస్తోంది. రోజంతా కష్టపడి ఐదు అడుగులు ఎక్కింది. మళ్లీ మూడడుగులు వెనక్కి జర్రున జారిపోయింది. మరి ఇలాగే రోజూ జరిగితే- ఎన్ని రోజుల్లో అది గొయ్యి నుంచి బయటికి రాగలుగుతుంది?

II బొమ్మకు



నేస్తాలూ,
ఈ పేజీలో నాలుగు రకాల పోటీలు ఇచ్చాం. అన్ని పోటీలకు విడివిడిగా బహుమతులు ఇస్తాం. కాబట్టి- మీరు అన్నింటిలో పాల్గొనవచ్చు. లేదంటే- ఒకటి, రెండింట్లో పాల్గొనవచ్చు. ప్రతి విభాగంలో ఐదుగురు విజేతలకు ఒక్కొక్కరికి రూ.300 విలువైన పుస్తకాలు పంపిస్తాం. జూన్ 2 నాటి సంచికలో విజేతల పేర్లు ప్రకటిస్తాం. ఎక్కువమంది సరైన జవాబులు రాస్తే- డ్రా ద్వారా ఐదుగురిని ఎంపిక చేస్తాం. మొత్తం 4 విభాగాల నుంచి 20 మంది బహుమతులు గెలుచుకునే అవకాశం ఉంది. మరింకెందుకు ఆలస్యం? వెంటనే మీ సమాధానాలను కింది చిరునామాకు ఈ నెల 20 లోగా పంపండి.

చిరునామా: మెదడుకు మేత, స్నేహ డెస్క్, ప్రజాశక్తి, ఎంబి విజ్ఞాన కేంద్రం, రాఘవయ్య పార్కు దగ్గర, విజయవాడ - 2

ఇవి లాజికల్ ప్రశ్నలు. జవాబులు తెలివిగా రాయాలి.
గమనిక : పెద్దలూ, మీ పిల్లలనే సొంతంగా రాయనివ్వండి.

తమాషా ప్రశ్నలు III

1. పరుగుపందెం జరుగుతోంది. నువ్వు రెండో స్థానంలో ఉన్నావు. ఆఖరి క్షణంలో హఠాత్తుగా చందూ నీకన్నా ముందుకు వెళ్లిపోయాడు. ఇప్పుడు చందూది ఏ స్థానం? నీది ఏ స్థానం?

3. దానిని మనం తినటానికే కొంటాం. కానీ, తినం, తినలేం. ఏమిటది?

మెదడుకు మేత



పక్కనున్న
బొమ్మలను చూశారు కదూ పిల్లలూ..! భలే
ఉన్నాయి కదా, అలాగే ఏదో కథ చెబుతున్నట్లే
అనిపిస్తోంది కదూ. ఈ బొమ్మల ఆధారంగా ఒక కథను
ఊహించి, దానిని రాసి మాకు పంపండి.
అర్థవంతమైన ముగింపు ఉండాలి
సుమా!

2. ప్రతి అరగంటకు ఒకసారి వేసుకొమ్మని డాక్టరు మూడు టాబ్లెట్లు ఇచ్చారు. ఆ మూడూ వేసుకోవటానికి ఎంత వ్యవధి అవసరమవుతుంది?



అనగనగా ఒక పిల్లి ఉంది. దానికి నాలుగు పిల్లలు పుట్టాయి. వాటిని చక్కగా పెంచుతోంది తల్లి. అవి నాలుగూ నాలుగు రంగుల్లో ఉన్నాయి. ఒకటి తెలుపు, ఇంకొకటి నలుపు. మరొకటి గోధుమ రంగు. ఆఖరిది గచ్చకాయరంగు. అవి రోజురోజుకూ పెద్దవి అవుతున్నప్పుడు- తన రంగు గొప్పంటే- తన రంగు గొప్పని వాదులాడుకోవటం మొదలెట్టాయి. రంగుల్లో గొప్పదనం లేదని, అన్ని రంగులూ సమానమేనని, మంచి బుద్ధి ఉండడమే ప్రధానమని తల్లి పిల్లి చాలాసార్లు చెప్పింది. అయినా... అవి వింటే కదా! అసలు వినలేదు. ఆ రంగుల గొడవలో పడి ఆ పిల్లిపిల్లలు ఒకదానికి ఒకటి శత్రువులా మారిపోయాయి. మాటలతో వాదులాడుకోవటమే కాదు; కొట్లాడుకోవటం మొదలు పెట్టాయి. ఒకదాని మీద ఒకటి దాడిచేయటం, రక్కేయటం, కొరికేయడం, ఉగ్రంగా చూస్తూ కోపంగా అరుచుకోవటం ... ఇలా ఆ ఇంటి వాతావరణం ఒక యుద్ధరంగంలా అయిపోయింది. తల్లి పిల్లి చాలా బాధపడింది. ఇప్పుడు ఏంచేయాలి? రంగుల బేధం, గొప్పదనాల గొడవ లేకుండా చేయడం ఎలా? అని రాత్రీపగలూ ఆలోచిస్తూనే ఉంది.

ఇది సగం కథ. మిగతా సగం మీరు రాయాలి.
పిల్లిపిల్లల మధ్య గొడవలు పోవాలి. నాలుగు పిల్లలూ అన్నదమ్ముల్లా కలిసి ఉండాలి.
తల్లిపిల్లి సంతోషంగా ఉండాలి.
... అలా ఉండేలా మిగతా కథను మీరు పూర్తి చేయాలి.

మీ కథ మాకు మే 20లోగా అందాలి.

ఈ కథకు ముగింపు మీదే

IV



పరీక్షల చివరిరోజు

- పి. చంద్రశేఖర అజాద్
92465 73575

ఆ రోజు ఆనందాల గురించి చెప్పాలంటే అదో సినిమా కథ అవుతుంది. అప్పటి దాకా అయిపోయిన పరీక్షలు, రానున్న పరీక్షలు, కొంతమంది మాత్రమే ఎలాంటి ఆందోళన పడకుండా వుండేవారు. వారికి పరీక్షలో ఫెయిల్ అవుతామనే భయం ఉండేది కాదు. ఎన్ని ఎక్కువ మార్కులు తెచ్చుకుంటాం అనేదే వారి ఆరాటం.

పరీక్షల చివరిరోజు మాత్రం పాత బట్టలు తొడుక్కునేవారు. అప్పటిదాకా కాగితాల మీదే అక్షరాల రూపంలో, అంకెల రూపంలో ముద్ర పడిన సిరా అప్పుడు బట్టలమీదే కోతిలా ఆడుకునేది. పాఠాలు బాగా చదివి బాగా పరీక్షలు రాయటం కన్నా ఇంకు జల్లుకోవటంలో పిల్లల సృజనాత్మకత వెల్లివిరిసేది. అసలు సిసలు ఆనందం పరీక్షల చివరిరోజు సినిమా చూడాలి. మొదటి ఆట చూడటంలో ఎంత ఆనందం ఉంటుందో ఈ ఆనందం కూడా అంతే.

అక్కడ నుంచి వేసవి సెలవులు ప్రారంభం. అలనాటి ఆనందాలు ఇప్పుడు చాలా వరకు అదృశ్యం అయ్యాయి. ఆరోజుల్లో సినిమా చూడటానికి అందరి దగ్గర డబ్బులుండేవి కాదు. అయినా, ఇంట్లో వారిని ఎంతగా హింసించినా సినిమా చూడలేక పోయినా వారిలో నేనూ ఒకడ్ని.

అప్పట్లో సినిమాకు మించిన వినోదం ఏమీ లేదు. సెలవుల్లో పిల్లల కోసం ప్రత్యేకంగా సినిమాలు వచ్చేవి. అంటే అవన్నీ పిల్లల సినిమాలు కాదు. పెద్దవాళ్లవే. అయితే పిల్లలు అందులో ముఖ్యపాత్రలు ధరించేవారు. లవకుశ, బాల భారతం, భక్త ప్రహ్లాద లాంటి అనేక పౌరాణిక సినిమాలు వచ్చేవి. సాంఘీక సినిమాలు కూడా పిల్లల్తో నిండిపోయి ఉండేవి. లేత మనసులు బాలరాజు కథ, శభాష్ సత్యం పాపం పసివాడు, రాము, ఇలా పదులు కొద్దీ సినిమాలు వచ్చేవి. తర్వాత కాలంలో కూడా రేపటి పౌరులు, అంజలి, లిటిల్ సోల్జర్స్, ఇలా అనేకనేక సినిమాలు వచ్చేవి. నేను అనేక సినిమాలు చూడలేకపోయాను. ఈ లిస్టు పెద్దది కాబట్టి పాత తరంవారు తాము చూసిన పిల్లల, పెద్దల సినిమాలను ఈ కాలం పిల్లలకు చెప్పవచ్చు.

అవన్నీ ఇప్పుడు దొరుకుతున్నాయి. వాటిని పిల్లలకు చూపించవచ్చు. అదంత సులభం కాదు. ముందు ఈ తరం పిల్లలు వాటిని చూడటానికి ఇష్టపడాలి. వారికి టీ.వీ, ఫోన్లు, రకరకాల పిల్లల చానల్స్ అందుబాటులోకి వచ్చాయి. అవన్నీ మన కథలు కాదు. మన వాతావరణం కాదు. అయినా పిల్లలు వాటికి అలవాటు పడిపోయారు. అవి కలిగించే రకరకాల పరిణామాలను మనం చూస్తున్నాం. చదువుతున్నాం. అవి స్వల్పమే. అసలు సిసలు ప్రమాదం కొన్ని దశాబ్దాల తర్వాత గాని బయటకు రాదు. మన మీద ఇలాంటి ప్రభావం అంత తీవ్రంగా వుంటుంది. రెండు



సంవత్సరాలకోసారి చిల్డ్రన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ జరుగుతుంటుంది. అవి నగరాల్లో జరుగుతాయి.

వాటిని గ్రామీణ పాత్రల్లో ఉన్నవారు చూడలేరు. అలాగే తెలుగులో పిల్లల సినిమాలకు ఏ మాత్రం ఆదరణ లేదు. మంచి కథలను ఎన్నిక చేయరు. ఒకటో అరో చేసిన వాటికి సమయానికి నిధులు అందించరు. అలా కొన్ని సినిమాలు తీసి చేతులు కట్టుకున్న వారు కొంతమంది ఇక్కడ ఉన్నారు. ఇపుడు సాహిత్యంలో, కవిత్వంలో, నాస్టాల్జియా, అంటే నిన్నటి తమ అనుభవాలు, జ్ఞాపకాలను చెప్పటం ఎక్కువ ఉంటోంది. అది సినిమాకొ మాత్రం పాకటంలేదు. పది చదవక ముందే ప్రేమలు వంటి కొన్ని సినిమాలు వస్తుంటాయి. ప్రేమికులకు మధ్యవర్తులుగా పిల్లలుంటారు. వారు వయసుకి, అనుభవానికి పొంతనే లేకుండా మాట్లాడుతుంటారు.



నిజానికి కుటుంబంలోని అన్ని వైరుధ్యాలు పిల్లల మీద ప్రభావం చూపిస్తుంటాయి. కొన్ని కుటుంబాల్లో వారు పని చేసి ఆ డబ్బుతో ఇంటిని నడుపుతారు. కోర్కెల్ని అణగదొక్కుకుంటారు. పరిమిత అవకాశాల నుంచి వారు ఎదుగుతారు. అనంతమైన త్యాగం, ఇతరులకు ఉపయోగపడాలనే తత్వం వారిలో పెరుగుతుంటాయి. వారి అల్లర్లలో సృజనాత్మకత వుంటుంది. అయితే అవేవి సినిమాలకు అనవసరం. సినిమా అంటేనే పెట్టుబడి అందుకని పెట్టుబడి దారుల లాభం రాని పనులు చేయరు. అయితే, ఇది ఓ కోణం. అన్ని చోట్లా ఇలాలేదు. నిరంతరం ఎన్ని కష్ట నష్టాలు ఎదురయినా తమ ప్రయత్నం మానుకోని వ్యక్తులున్నారు.

చిన్న చిన్న సినిమాలు తీస్తుంటారు. అలాగే డిజిటల్ యుగం వచ్చాక తక్కువ ఖర్చుతో అనేక మంచి సినిమాలు నిర్మించే అవకాశాలు వచ్చాయి. నేను మిత్రులుకు చెపుతుంటాను. 'ఇరాన్' సినిమాలను చూడండి అని. అక్కడ గొప్ప దర్శకులు ఉన్నారు. పిల్లల కోసం వారు ప్రత్యేకంగా సినిమాలు తీస్తారు. అందులో జీవితం ఉంటుంది. అవి చూస్తున్నప్పుడు మనకు తన్మయత్వం కలుగుతుంది. మనసారా నవ్వుకుంటాం ఏడుస్తాం. చప్పట్లు కొడతాం. లిటిల్‌మాన్, దికార్ట్, వేరీజ్ మై ఫ్రెండ్స్ హోమ్ ఇలాంటి పదుల కొద్దీ సినిమాలున్నాయి. చైనా, రష్యా, అమెరికన్ సినిమాలు అలాగే వివిధ దేశాలకు చెందిన సినిమాలు నెట్‌లో దొరుకుతాయి.

ఈ రోజు స్మార్ట్ ఫోన్‌తో కూడా చిన్న చిన్న ఫిల్మ్ తీయవచ్చు. అలాంటి ప్రయోగాలు చేస్తున్నారు. ప్రభుత్వాలు ఇలాంటి బాధ్యతలు తీసుకోవు నిరంతరం చదవటం వేసవి సెలవులను కూడా వారికి దూరం చేయటం మనం చూస్తున్నం అందుకే సామాజికంగా ఓ అశాంతి వాతావరణం ఇంతకుముందు అన్నట్లు మానసికంగా అత్యంత విషాదకరమైన వాతావరణం పిల్లల్లో గూడు కట్టుకుంటోంది. ఇవన్నీ ఎవరు చేయాలంటే పిల్లల్ని ప్రేమించేవారు, అవకాశాలు ఉన్నవారు చేయాలి. అని ప్రపంచమంతా చూడటం కుదరదు. మన ప్రాంతంలో మన పరిధిలో చాలు. అలాగే ఈ సెలవుల్లో పిల్లలకు మంచి చదువులు కాదు, మంచి కథలను పరిచయం చేయాలి. వారితో రాయించాలి. ముఖ్యంగా పిల్లల్ని ప్రకృతిలోకి తీసుకెళ్ళి అనుబంధాన్ని పెంచాలి. మనం చిన్న తనంలో ఏం కోల్పోయాం అన్నది పెద్దలుగా మనకు తెలుసు. కనీసం ఓ నెలరోజులు పిల్లలకి స్వేచ్ఛ ఇద్దాం. వారిలోని అద్భుత శక్తులను బయటకు తీద్దాం పిల్లలకు అలాంటప్పుడే ఎంత కఠినమైన పాఠాలయినా సులభంగా అర్థం అయ్యే అవకాశం ఉంది.





పిల్లల ఊహాలకు విజ్ఞాన రెక్కలు

- నారంశెట్టి ఉమామహేశ్వరరావు
94907 99203

మళ్ళీ పుస్తకాలేనా.. అని పిల్లలు అనొచ్చు. ఇవి సాహిత్య పుస్తకాలు. తరగతి పుస్తకాలు విజ్ఞానం మాత్రమే అందిస్తాయి. కానీ, సాహిత్యం బతుకు తీరు నేర్పుతూ ప్రపంచ దర్శనం చేయిస్తుంది. ఈ మధ్య ఒక ప్రయివేట్ పాఠశాలలో పిల్లలకు కథాకార్యశాల నిర్వహిస్తూ 'కథల పుస్తకాలు లేదా సాహిత్యం చదువుతారా' అని అడిగితే తొంభై శాతం మంది పిల్లలు చదవడంలేదని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రం సగం మంది పిల్లలైనా కథలు చదువుతున్నారని నా పర్యటనల్లో తెలిసింది. పిల్లల మనసుల్లోని భయం, ఒత్తిడి పోయే మార్గాలను ప్రైవేటు పాఠశాలలు పట్టించుకోవడం లేదని తెలుస్తోంది.

ఒకప్పుడు ఆరుబయట వెన్నెల్లో మంచం వేసుకుని ఆకాశంలోని నక్షత్రాలను పిల్లలు లెక్కిస్తుంటే దగ్గర్లో కూర్చొని అమ్మమ్మలు తాతయ్యలు కథలు, పద్యాలు, అనుభవాలు చెప్పేవారు. మంచి చెడుల తారతమ్యం, లోకజ్ఞానం, పుస్తకాలలో రాయనివి, గురువు చెప్పనివి కూడా బోధించేవారు. పిల్లలకు పెద్దలున్నారన్న భరోసా, ఆత్మీయత పరోక్షంగా అందేవి. ఈ కాలం పిల్లలు మార్కుల పరుగు పందెంలో ర్యాంకుల రేసు గెలవడానికే సరిపోతుంది. తల్లిదండ్రులు గురువులు నిర్వహిస్తున్న విద్యాయజ్ఞంలో సమిధలవుతున్నారు.

ఏడాదంతా తరగతి పుస్తకాలు చదివి అలసిన పసిమొగ్గలకు సెలవుల ఆటవిడుపు దొరికింది. కొన్నాళ్ళు విహార యాత్రలు చేసినా, మిగిలిన కాలంలో ఆటపాటలతో సమయాన్ని పిల్లలు వృధా చేయకుండా వినోదంతో పాటు విజ్ఞానం అందించాల్సిన బాధ్యత పెద్దలదే. నటన, రచన, నృత్యం, సంగీతం లాంటి అభిరుచులను సెలవుల్లో నేర్పించవచ్చు. వీటికితోడు పిల్లల దృష్టిని పుస్తక పఠనం వైపు మరల్చవచ్చు.

'మీ పిల్లలు తెలివైన వాళ్ళుగా ఎదగాలంటే వాళ్లకు మంచి కాల్పనిక కథలు చదివి వినిపించండి. మరింత తెలివైనవాళ్ళు కావాలంటే మరిన్ని మంచి కథలను చదివి వినిపించండి' అని భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి గ్రహీత ఐన్‌స్టీన్ చెప్పిన మాటలు వింటే మన కాలం తల్లిదండ్రులు ఎంత అమాయకులో, ఎండమావిలో నీరు వెతుకుతూ అమృత భాండాగారాలైన పుస్తకాలను దూరం చేస్తున్నారనిపిస్తుంది.

శరీర ఆరోగ్యం కోసం వ్యాయామం ఎంత అవసరమో మానసిక వికాసానికి పుస్తక పఠనం అంతే మేలు చేస్తుంది. మన క్షేమం కోరేవి, తప్పులు చెప్పేవి, అభివృద్ధిలోకి నడిపించేవి పుస్తకాలు మాత్రమే. 'పుస్తకం నోరు తెరవని ఉపన్యాసకుడు.. మౌనం వహించిన కవి.. ఒంటరితనం పోగొట్టే స్నేహితుడు.. మరో లోకానికి తీసుకుపోయే మాంత్రికుడు' అన్నారు మన్నవ గిరిధరరావు. అది సత్యం.



పిల్లలకు పుస్తకం ఒక మంచి నేస్తం కావాలంటే మంచి పుస్తకాలు చదివించాలి. బాలల కోసం సృష్టించిన సాహిత్యం చాలా వుంది. అందులో కథలు, గేయాలు, గేయ కథలు, పద్యాలు, వ్యాసాలు, నవలలు, నాటికలు, జీవిత చరిత్రలు ఉన్నాయి. పిల్లలు పుస్తకాలు ఇష్టంగా చదవాలంటే వాళ్ళకి ముందుగా కథలు చెప్పాలి. కథల పుస్తకాలు చదివించాలి. చిన్నగా ఉండి చదవగానే వినోదాన్ని కలిగించి, తరువాత విజ్ఞానాన్ని, వికాసాన్ని కలిగిస్తుంది కథ. త్వరగా ఆకట్టుకుని మానసిక అలసట దూరం చేసి నూతనోత్తేజం కలిగిస్తుంది. మరో లోకంలోకి తీసుకుపోయి తియ్యని అనుభూతులు పంచుతాయి కథలు. అందుకే చాలామంది పిల్లలు కథలంటే చెవి కోసుకుంటారు.

మానవీయ సంస్కృతి తెలిపే పుస్తకాలు టీవీ చూసిన ప్రయోజనం కంటే పుస్తకం

ఇచ్చే ప్రయోజనం ఎలాగూ గొప్పదే. బాల్యంలో అలవాటు చేసిన మంచి లక్షణాలు జీవితంలో ఎక్కువ కాలం గుర్తుంటాయి. బాల్యం నుండే మంచిచెడులు, దయాధర్మాలు, మానవతా లక్షణాలను వివరించే సాహిత్యం పిల్లలకు అలవాటు చేయడం వలన మంచి మనుషులుగా ఎదుగుతారు. ఉగ్గుపాలతోనే ఎక్కించాల్సిన నీతినిజాయితీలు పిల్లల రక్తంలో ప్రవహించకపోతే సమాజంలో అవినీతి పరులు, బంధుప్రీతి ఉన్న వాళ్ళు పెరుగుతారు. అది దేశ భవిష్యత్తుని నాశనం చేస్తుంది.

పుస్తక పఠన ప్రయోజనాలు

ఒకవ్యక్తి ఇతరులతో స్పందించే తీరు పుస్తక పఠనం వల్ల మెరుగవుతుంది. ఇతరుల కష్టసుఖాలలో పాలుపంచుకునే తీరు సంస్కారం పెరుగుతాయి. మూఢనమ్మకాలు దూరమవుతాయి. పుస్తకం ఊహాశక్తిని పెంచుతుంది. పదసంపదను పెంపొందిస్తుంది. ఆలోచనాశక్తిని పెంచి

పిల్లల ఊహాలకు విజ్ఞాన రెక్కలు



వికసింపజేస్తుంది. పిల్లల్లో పఠనం, లేఖనం, శ్రవణం, భాషణం మొదలైన భాషా నైపుణ్యాలు పెరుగుతాయి. పత్రికలు, కథల పుస్తకాలు చదివే పిల్లల్లో సంభాషణా చాతుర్యం, మెరుగైన ఆలోచనా పద్ధతులు ఏర్పడడాన్ని నిత్య జీవితంలో చూస్తున్నాం. బోధనల కన్నా స్వయంగా చదివి నేర్చుకున్న విషయాల మీద శ్రద్ధ ఎక్కువ చూపుతారు పిల్లలు. చదవడమనే మంచి అభిరుచి పెరుగుతున్న కొద్దీ భాష మీద పట్టు, భావవ్యక్తీకరణ సామర్థ్యం పెరుగుతాయి. చదవడంలో అనుకూలత ఏర్పడి పాఠ్య పుస్తకాలను కూడా సులభంగా చదివి అర్థం చేసుకోగలరు. చదివిన విషయాలను మిత్రులతో చర్చించడం వలన జ్ఞాపకశక్తి, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి. పిల్లలను విజ్ఞానులుగా మార్చే శక్తి పుస్తకాలకే ఉంది.

పాఠాలకే పరిమితమయ్యే పిల్లల కన్నా ఇతర పుస్తకాలు చదివే పిల్లలలో తెలివి, చురుకుదనం, స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే శక్తి ఎక్కువ. అనేక మంది రచయితలు తమ అనుభవం, తెలివితో ఎన్నో సమస్యలు సష్టించి ఎదుర్కొనే విధానాలను రాసినవి పుస్తకాలలో చదివి ఉండడమే అందుకు కారణం. గొప్ప అవగాహనతో సమాజ పోకడను త్వరగా అర్థం చేసుకోగల సామర్థ్యం పుస్తక ప్రియులకు అలవడుతుంది. విదేశీ రచయితల సాహిత్యం చదవడం వల్ల ఆయా దేశాల సంస్కృతి సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, పరిసరాలు, భావాలు కూడా తెలుస్తాయి. పిల్లలలో పరోపకారం, సేవాభావం, ఆత్మవిశ్వాసం, ముందుచూపు, సందేశం, సమయస్ఫూర్తి, అపాయంలో ఉపాయం లాంటి మంచి లక్షణాలు పెరగాలంటే పుస్తకాలే సాయం చేస్తాయి.

ఎలాంటి సాహిత్యం చదివించాలి

'కాలినపెనం మీద పడిన నీటిచుక్క నామరూపాల్లేకుండా పోతుంది. తామరాకు మీద పడితే కాసేపు



ముత్యంలాగా కనబడుతుంది. అదే నీటిచుక్క ముత్యపు చిప్పలో పడితే నిజంగా ముత్యమై విరాజిల్లుతుంది' అనేది సుభాషితం. నేటి పిల్లలు కూడా ఆకాశం నుంచి జారిపడే వర్షపు చినుకుల్లాంటి వారే. పెరిగిన వాతావరణం పిల్లల భవిష్యత్తును నిర్దేశిస్తుంది కాబట్టి పిల్లల మెదళ్ళ మీద చిన్నప్పుడు పడిన భావాల ప్రభావం శాశ్వతంగా ముద్రించుకోవాలంటే వారికోసమే రాసిన బాలసాహిత్యం చదివించాలి. రోజుకి కనీసం రెండు గంటలు చదివిస్తే చాలు. పంచదార రుచి మరిగిన చీమలు పంచదార కోసం వెతికినట్లు ఒకసారి మంచి బాలసాహిత్యపు రుచి చూపిస్తే పిల్లలే అడిగి మరీ చదువుతారు.

పుస్తకాలు పిల్లల మీద చాలా ప్రభావం చూపిస్తాయి. పుస్తకాలను చదివి జీవితాల్ని మార్చుకున్నవారు, గొప్పవారయినవారు ఎందరో ఉన్నారు. ఏ అలవాటు అయినా ఎక్కువైతే ప్రమాదం కానీ, ఎంత ఎక్కువైనా ప్రమాదం లేని అలవాటు పుస్తక పఠనం ఒక్కటే.

ఎలాంటి పుస్తకాలు చదవాలి

పిల్లలు చదవాల్సిన పుస్తకాలను మొదట్లో పెద్దలు చదివి మంచివి అని భావించినవి సూచించడం మంచిది. పూర్వకాలంలో పిల్లల చేత సుమతీ శతకం, వేమన శతకం వంటివి కంఠతా పెట్టించేవారు. పిల్లలలో నీతి భావనలు పెంచి మనో వికాసాన్ని కలిగించేవి, జ్ఞాపకశక్తిని పెంచేవి శతకాలు. వాటిని దూరం చేస్తున్నారు గురువులు, తల్లిదండ్రులు. శ్రావణకుమారుడి కథ చదివి తల్లిదండ్రులను సేవించడం, సత్యహరిశ్చంద్ర నాటకం చూసి అబద్ధం చెప్పడం మానేసినట్లు మహాత్మాగాంధీ రాశారు. భారత రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్ అంబేద్కర్... గ్రంథ పఠనంలో మునిగి భోజనం చేయడం మరచిపోయిన సందర్భాలెన్నో ఉన్నాయి. బాల్యంలో అమ్మ నేర్పిన కథల ప్రేరణతో పుస్తకాలు చదివి గొప్పవారయిన వారిలో ఛత్రపతి శివాజీ ఒకరు.

నీతి కథలతో సమానంగా ప్రముఖుల బాల్యాలకు సంబంధించిన రచనలు, చారిత్రక రచనలు, దేశభక్తి రచనలు చదివిస్తే చక్కని స్ఫూర్తి పొందుతారు. చక్రవర్తిగా పుట్టిన గౌతముడు బుద్ధుడిగా మారడం, నిరుపేద కుటుంబంలో పుట్టిన క్రీస్తు ప్రవక్తగా మారడం, చిన్నప్పుడు ఉప్పు అమ్ముకొని బతికిన నానక్ శిక్కుమతాన్ని స్థాపించడం, ఉడకబెట్టిన బంగాళదుంపలు అమ్మిన అబ్రహం లింకన్ ఆ తరువాత అమెరికాకు ప్రెసిడెంట్‌గా ఎదగడం, పావలా డబ్బు లేక ఓడ ఎక్కలేక పోయి, నదిలో ఈదిన లాల్ బహదూర్ శాస్త్రి, భారత ప్రధానిగా ఎదగడం, పేపర్ బోయ్‌గా పని చేసిన అబ్దుల్ కలామ్ రాష్ట్రపతిగా ఎదగడం లాంటివి బాలల్లో స్ఫూర్తి నింపుతాయి.

చదవాల్సిన పుస్తకాలు

కథాసరిత్సాగరం (గుణాఢ్యుడు), సులభశైలిలో రాసిన పంచతంత్రం (సహవాసి), దేశదేశాల జానపద కథలు (ఊట్ల కొండయ్య), తెలుగు అనువాద బాలల కథలు (మార్క్ ట్వైన్), నొప్పి డాక్టర్ (కె.చుకోవిస్కీ), తానా- మంచి పుస్తకం ప్రచురించిన బాలల నవలలు-బొమ్మల కథలు, మూడు ఎలుగుబంట్లు, పిచ్చిపుల్లయ్య, ఈసపు చెప్పిన కథలు, బాలల కథలు (లియో టాల్‌స్టాయ్), ఆనందజీవి (కె.సురేష్), ఆనందలోకం, ఊహాలకే రెక్కలొస్తే, ఎలుగుబంటి స్నేహం, అమ్మ మనసు, ఆనందం (దాసరి వెంకటరమణ), స్వర్ణ పుష్పాలు (అలపర్తి వెంకట సుబ్బారావు), చెట్టు చెప్పిన కథలు (చొక్కాపు వెంకట రమణ), మణిదీపాలు (రెడ్డి రాఘవయ్య), అడుగుజాడలు (డి.శ్రీనివాస దీక్షితులు), పిల్లల కథలు (నార్ల చిరంజీవి), మాన్యులు (డి. సురేష్ బాబు), బాలల కోసం ప్రసిద్ధుల జీవితాలు (యల్లాప్రగడ సీతాకుమారి), స్ఫూర్తి కథలు (వాసాల నరసయ్య) మొదలగునవి పిల్లలచే చదివించడం ఉత్తమం.

గ్రామ సింహం

సైన్స్ కథ



వేసవి సెలవులు రావడంతో తమ స్కూల్లోనే ఏర్పాటు చేసిన సమ్మర్ కేంప్‌కు బయలుదేరింది ప్రజ్ఞ బృందం. పిచ్చాపాటీ మాట్లాడుకుంటూ నడుస్తున్నారు. తమ స్కూల్లో కొత్తగా చేరిన రాగిణిని కూడా కలుపుకుని వెళ్లడానికి దార్లోనే ఉన్న వాళ్ల ఇంటికి వెళ్లారు. గేటు బయట బ్రేక్ వేసినట్లు ఆగిపోయారు అంతా, గేట్‌కి 'కుక్క ఉంది జాగ్రత్త,' అనే బోర్డు కనిపించటంతో.. గేటు బయట నుంచే కాలింగ్ బెల్ కొట్టి పిలవడంతో తను కూడా వారి బృందంతో కలిసి బయలుదేరింది.

కొంత దూరం సాగిందో లేదో వారి నడక, వీధి కుక్కల గుంపు తమవైపు వేగంగా రావడంతో పరుగులంకించుకున్నారంతా. పరుగులో వెనుకపడిన రాగిణి ఒక కుక్క బారిన పడటం క్షణంలో అయిపోయింది. అది తనను గాయపరచడమే కాకుండా పిల్లలందర్నీ భయభ్రాంతుల్ని చేసింది.

రాగిణిని తీసుకుని గబగబా వాళ్లింటికి చేరుకున్నారు అంతా.. మొదట భయపడినా రాగిణి కొంత కోలుకుంది. వాళ్ల నాన్నగారు పిల్లలందరికీ ధైర్యం చెప్తూ.. వెంటనే గాయాన్ని శుభ్రంగా కడిగి డాక్టర్ దగ్గరకు తీసుకుని వెళ్లడానికి సిద్ధమై, జరిగిన విషయమంతా టీచర్‌కి చెప్పాలని చెప్పారు.

అప్పటికే టైం అయిపోవటంతో లేటుగానే స్కూలుకు చేరుకున్నారంతా.

ప్రజ్ఞకు కుక్కలంటే మహా ఇష్టం. వాటిని చిన్నప్పటి నుంచీ పెంచుకోవాలనే కోరిక. కానీ, ఇంట్లో దానిని ఎవరు చూసుకుంటారు అనే అంశంపై ఒప్పుకోకపోవడంతో అవకాశం లేకపోయింది. దారి మధ్యలో ఎదురైన విషయమంతా వివరంగా క్రాంతి మాస్టారుకి చెప్పింది ప్రజ్ఞ. పిల్లలకు ధైర్యం చెప్తూ కుక్కల వల్ల ఇలాంటి పరిస్థితి అప్పుడప్పుడు సంభవించడం సహజమే అని చెబుతూ వారికి ధైర్యం చెప్పారు.

ఆ సంఘటన రేపిన అలజడి నుంచి బయటపడిన ప్రజ్ఞ, 'కుక్కలను మనిషి మచ్చిక చేసుకోవడం ఎప్పటి నుంచి ప్రారంభమైంది సార్?' అని అడిగింది. కుక్కల పట్ల పిల్లల అనుమానాలన్నీ తీర్చటం ద్వారా వారి కున్న భయాన్ని పోగొట్టాలని నిర్ణయానికి వచ్చిన మాస్టారు చెప్పటం మొదలుపెట్టారు. చూడు ప్రజ్ఞ.. 'మానవుడు రాతియుగంలో గుహలో నివసించేవాడు కదా.. అప్పటినుంచే కుక్కలను మచ్చిక చేసుకోవడం ప్రారంభమైంద'ని చెప్పారు. అవునా!! 'వాటిని మచ్చిక చేసుకోవల్సిన అవసరం మనిషికి ఎందుకు ఏర్పడింది సార్?' ప్రశ్నించింది ప్రజ్ఞ. 'సమయానికి ఆహారం అందించే యజమాని పట్ల ఎంతో విశ్వాసం చూపించే కుక్కలు కొన్ని లక్షల సంవత్సరాల నుంచి మనుషులతో జీవనం సాగిస్తున్నాయి. ఆ క్రమంలో మనిషి, కుక్కలను తన అవసరాలకు ఎలా ఉపయోగించుకోవాలో పూర్తిగా తెలుసుకోగలిగాడు. వీటిద్వారా ప్రయోజనం పొందుతూ దానిని పెంపుడు జంతువుగా మార్చేసుకున్నాడు.' 'కుక్కలు మానవులకు ఎలా ఉపయోగపడుతున్నాయి సార్?' అన్న ప్రశ్నకు సమాధానం చెప్పారు.

'ఆదిమానవుడు తన మేధస్సు పెరిగేకొద్దీ కుక్కలను ఉపయోగించి వేటాడడానికి, పశువులకు ఇంటికి కాపలాగా, ఎలుకలు, ఇతర హానికర జీవాలను నిర్మూలించడానికి ఉపయోగించటమే కాకుండా, రవాణాలో బండ్లను లాగడానికి కూడా ఉపయోగించేవాడు. నేటి ఆధునిక కాలంలోనూ.. నేర పరిశోధనలో, నేరస్తుడిని పట్టుకోవడానికి పోలీసు శాఖ వారు దీనిని చక్కగా వినియోగించుకుంటున్నారు' అని వివరించారు.

'కొంతమంది మనుషులు కుక్కలను తమ ఇంట్లో కాపలా కాయడానికి, మరి కొంతమంది స్టేటస్ సింబల్‌గా పెంచుతారు కదా సార్?' అంటూ ఒక స్టేట్మెంట్ పాస్ చేసింది.

'అవును.. చాలామంది కుక్కలను భద్రత కోసం పెంచటం అనేది నిజమే అయినా.. వాటి విశ్వాసాన్ని తెలుసుకున్న మానవుడు కుక్కలపై ఎంతో ప్రేమను పెంచుకుంటారు. కుక్కలు తమ యజమానులను చాలా నిజాయితీగా ప్రేమిస్తాయి.

'గత నెలలో మిమ్మల్ని స్కూల్ నుంచి జూకి విహారానికి (Picnic) తీసుకెళ్లినప్పుడు మీకు ఏమనిపించింది చెప్పండీ..' అని మాస్టారు పిల్లల్ని సరదాగా వేసిన ప్రశ్నకు సమాధానంగా వారి కేరింత, తుళ్లింతల అరుపులతో చెవులు మోగిపోయాయి. 'ఆగండి ఆగండీ...

అక్కడ మీకు ఎదురయ్యే ప్రతి జంతువును తీక్షణంగా పరిశీలించి ఆ బుజ్జి బుర్రలో ఎన్నో ప్రశ్నపు జల్లులు కురిసాయి. ఓ పక్క వాటిని చూస్తూ ఆనందిస్తూనే ఎన్నెన్నో విషయాలను తెలుసుకున్నారు. వాటిలానే తాము నడవాలని, పాకాలని, ఎగరాలని ముచ్చటపడతారు. జంతువులు, పక్షులు ఎలా తింటున్నాయో, ఎలా ఆడుకుంటున్నాయో చూసి ఆనందించారు అవునా?' అన్న సమాధానంగా ప్రజ్ఞ లేచి నిలబడి మాస్టారు నేను ఇంటికి వెళ్లి 'అమ్మా..! మనం చిలుకనూ, కుక్కని పెంచుకుందామా ప్లీజ్.. అంటూ వేడుకున్నాను మాస్టారు.' కానీ... ఇంట్లో ఒప్పుకోలేదు అని బుంగమూతి పెట్టుకుంది. అవును ప్రపంచంలో ఉండే పిల్లలందరూ ప్రకృతి ఆరాధ్యులే..! ప్రకృతికి దగ్గరగా ఉండాలని కోరుకుంటారు అది సహజమే' అని సమాధానం చెప్పారు క్రాంతి మాస్టారు.

'ఇళ్లలో పెంచుకునే కుక్కలను జాతి కుక్కలు అంటారు కదా సార్? వాటిని చాలా డబ్బులు ఖర్చుపెట్టి కొంటారు కదా?.. వాటిలో కొన్నింటి పేర్లు చెప్పండి సార్?' ప్రశ్నించింది ప్రజ్ఞ.

'జాతికుక్కలు గురించిన విషయాలు నాకు కూడా సరిగ్గా తెలియదురా.. ఓ పని చేద్దాం మనం ఇంటర్నెట్ ద్వారా తెలుసుకుందాం' అని చెబుతూ సెల్ ఫోన్‌లో దానికి సంబంధించిన విషయాలను రాబట్టారు క్షణంలో. అందులో వాటి పేర్లు బొమ్మలతో సహా పూర్తి వివరాలు ఉన్నాయి. గోల్డెన్ రిట్రీవర్, డాల్మేషియన్, డాబ్బెర్మన్, పిట్ బుల్, అమర్నాథ్, రాట్‌వైలర్ బాక్సర్ వంటివి కొన్ని



పేరొందిన పెంపుడు కుక్కలు. వాటి మేధస్సు వీధి కుక్కల కంటే చాలా మెరుగ్గా ఉండటమే కాకుండా వాటి యజమానులతో చాలా ఫ్రెండ్లీగా ఉంటూ, కుటుంబ సభ్యులూ కలసిపోతాయని వివరించారు.

ఆసక్తిగా అందరితో పాటు వింటున్న రాము కుక్కలతో తనకున్న అనుభవాలు నెమరు వేసుకోసాగాడు. అనేకసార్లు వీధి కుక్కలు తన ఇంటి ముందు పెట్టిన సైకిల్ టైర్లపై మూత్ర విసర్జన చేయటం మిగిలిన జంతువుల్లా కాకుండా కాలు పైకెత్తి ఎందుకు చేస్తుందో తెలియక మాస్టర్‌ని అడిగాడు.

కాస్త నవ్వుకుంటూ... 'చూడు రాము కొన్ని విచిత్రమైన అలవాట్లు కుక్కల్లో మనం గమనించవచ్చు, అందులో నువ్వు చెప్పింది కూడా ఒకటి. దానికి కారణం చెబుతాను' జాగ్రత్తగా విను...

'మనం ఉపయోగించే వాహనాలు అనేక రకాలైన రోడ్లపై వెళతాయి కదా.! కొన్ని సార్లు మట్టిరోడ్లు, తారురోడ్లు, బురద.. ఇలా రకరకాల రోడ్లపై వెళ్లే సమయంలో వాటి టైర్లు చెత్త, వ్యర్థాలను తొక్కుకుంటూ వెళ్తాయి కదా ఆ చెత్తలో ఎన్నో రకాల వ్యర్థ పదార్థాలతో పాటు మనుషులు, జంతువుల మలం కూడా ఉండవచ్చు. ఈ క్రమంలో అలాంటి వ్యర్థాలను తొక్కుకుంటూ వెళ్లిన వాహనాల టైర్లు వాసన చూసే కుక్కలకు చెత్త డంపింగ్ ప్రదేశాల్లా అనిపిస్తాయి. అందుకనే అది చెత్త ప్రదేశమని భావించి అవి వాహనాల టైర్‌పై మూత్రం పోస్తాయి.. అలాగే.. వీధి లాంతరు స్తంభం కానీ, చెట్టు మొదలు కానీ, కనిపిస్తే కుక్కలు పని ఉన్నట్లు ఆగి కొంచెం మూత్రం పోసి నడక సాగిస్తాయి. కాస్త దూరం వెళ్లాక మళ్లీ మరొక స్తంభం కనిపిస్తే దాని మీద కూడా... ఇలా చాలాసార్లు చేస్తూపోవటం మీరు గమనించి ఉండవచ్చు.'

'వీటి ప్రవర్తనకు సంబంధించిన మరిన్ని విషయాలను చెప్పండి సార్' అన్న ప్రశ్న మాస్టారిని తిరిగి చెప్పే విధంగా చేసింది.

'ఈ జంతువులు అడవిలో ఉన్న రోజుల్లో అన్ని గుంపులు గుంపులుగా ఆహారం కోసం బయలుదేరేవి. తినడానికి జంతు వేదైనా దొరుకుతుందేమోనని అడవిలో వెతికే క్రమంలో, నలుమూలలకీ విడిపోయేవి. ఈ జంతువుల కళ్లు ముక్కులు చాలా సున్నితమైనవి. సూక్ష్మ గ్రాహ్యకాలు. ఈ ఇంద్రియాల సహాయంతో ఆహారం కోసం వెతికి వాటిని తెలుసుకోగలుగుతాయి. ఇలా పసిగడుతూ సాగే వీటి ప్రయాణం ఒక్కసారి వందల మైళ్ల దాకా వెళ్లేవి.' అదే దారిలో తర్వాత వెళ్లే కుక్కలకు ఆ దారిలో ఎన్ని కుక్కలు ఎటు వైపు వెళ్లాయో, ఎంత సేపటి క్రితం వెళ్లాయో, అవి వెళ్లిన దారిలో కొంత ఎత్తైన ప్రాంతంలో అవి చేసిన మూత్ర విసర్జనను వాసన చూస్తూ అవి ఎటుగా వెళ్లాయో తెలుసుకుని వాటిని కలుసుకునే ప్రయత్నం చేస్తాయి.'

'అవునా! సార్ కుక్కల ప్రవర్తనలో అంత అర్థం ఉందా!' వాటికి అంత పరిశీలన ఉంటుందా !! అంటూ ఆశ్చర్యపోతూ, 'కుక్కలకు మాత్రమే వాసన పసిగట్టే శక్తి ఎందుకు ఎక్కువగా ఉంటుంది సార్?' ప్రశ్నించింది ప్రజ్ఞ. 'చూడు ప్రజ్ఞ కుక్కకు వాసన పసికట్టే శక్తి ఎందుకంటే దాని ముక్కులో ఉండే 'ఆల్ ఫ్యాక్టరీ బల్బ్' అనే భాగం మనిషితో పోలిస్తే చాలా పెద్దగా ఉంటుంది. దాని ముక్కు ఎప్పుడూ తేమగా ఉండటం వల్ల వాసనలు ఎక్కువగా గుర్తుపట్టగలవు. మీకు తెలుసా..! కుక్కలు ఏ వాసనని నిర్లక్ష్యం చేయవు ప్రతి వాసనను సునిశితంగా



పరశీలిస్తాయనీ..'

'ఈ వాసన పసిగట్టే లక్షణం వల్ల కుక్కకి ఏమైనా ప్రయోజనం జరుగుతుందా సార్?' ప్రశ్నించింది ప్రజ్ఞ. ఈ వాసన కనిపెట్టే ప్రక్రియ కుక్కలకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందిరా.. కుక్కలు తిండి సంపాదించడానికి, శత్రువులను గుర్తించడానికి, తోడు వెతుక్కోడానికి, తమ పిల్లలను గుర్తించడానికి వాసనను వాడుకుంటాయి.'

'మా ఇంటి దగ్గర చాలా కుక్కలు తిరుగుతూ ఉంటాయి సార్, నేను చాలా సార్లు గమనించాను కుక్కలు పడుకునేటప్పుడు ఆ ప్రదేశం చుట్టూ గిరగిరా తిరుగుతూ నేలను కాలుతో గీరుతూ, బాగా పరిశీలించిన తర్వాత మాత్రమే పడుకుంటాయి ఎందుకని సార్ ?' అనుమానంగా ప్రశ్నించాడు రాము.. పిల్లల పరిశీలనకు ఆశ్చర్యపడుతూ మనసులోనే నవ్వుకుంటూ..

'చక్కగా గమనించావు రాము.. కుక్కలు అడవుల్లో ఉండే కాలంలో పడుకునే ముందు ఆ ప్రదేశం ప్రమాదరహితమైంది అవునో, కాదో .తేల్చుకుని కానీ నిద్రకు ఉపక్రమించేవి కావు. అవి పడుకోబోయే చోటు ముళ్లు, పురుగు పుట్ర లేవు కదా అని జాగ్రత్తగా గమనించటమే కాదు, అది పడుకునే పక్కను ఒకటికి రెండుసార్లు సరిచేసుకుని మరీ పడుకునే అలవాటు ఉండేది. అదే లక్షణం ఇప్పటికీ కొనసాగుతుంది. అందుకే మనుషులకు మచ్చికైన వేల సంవత్సరాలు తర్వాత కూడా వాటి పాత లక్షణాలు పోలేదు.' 'ఇంత సుదీర్ఘమైన కాలం మనిషి దగ్గర ఉంటూ వేల తరాలుగా అరణ్య జీవనాన్ని పూర్తిగా విడిచిపెట్టినప్పటికీ, దాని చర్మాన్ని పట్టి మిగిలిపోయిన తొలి అడవి జాతి లక్షణాలు ఈ నాటికి కుక్కల్లో కనిపపించడం విచిత్రంగా లేదు?'

'మా ఇంటి పక్కన ఖాళీ స్థలంలో కుక్కలు వాటికి దొరికిన ఎముకలను తెచ్చి కాళ్లతో గుంట చేసి అందులో పాతిపెట్టటం నేను చాలాసార్లు చూసాను, దానికి కారణం ఏమిటి సార్?' ఆసక్తిగా ప్రశ్నించాడు రాము.

'అది కుడా ఓ జీవలక్షణమే రాము.. కుక్కలు అడవుల్లో జీవిస్తున్న రోజుల్లో దొరికిన ఆహారాన్ని ముందు ముందు వాడుకోవడానికి గుంటల్లో, ఆకుల కింద దాచిపెట్టడం వాటి లక్షణం'. అదే అలవాటు ఈనాటికీ ఎముకలను గొయ్యి తీసి పాతిపెట్టటం.'

'అవునా సార్.. 'మరి రాత్రి పూట కుక్కలు మోర పైకి పెట్టి అరుస్తూ ఉంటాయి కదా సార్?' దానికి కారణం ఏంటి? అమ్మమ్మ అయితే దీన్ని ఎవరో రాకగా చెబుతూ.. కుక్కల్ని చాలా విసుక్కుంటుంది. అది నిజమేనా సార్?' అంటూ ఆసక్తిగా ప్రశ్నించాడు.

'ఈవారం చాలా ప్రశ్నలే వేశారు పిల్లలూ..! వచ్చేవారం మరికొన్ని విషయాలు తెలుసుకుందాం ఓకేనా.. మరి. ఇక వెళ్లి హాయిగా ఆడుకోండి.' అని మాస్టారు గారు చెప్పారు. పిల్లలంతా 'అయ్... హొయ్...' అనుకుంటూ మైదానంలోకి పరుగులు తీశారు.

(మిగతా వచ్చేవారం)

- సుంద్రు శ్రీనివాసరావు
94945 32570



స్వేచ్ఛ

బాలల కథ

పెరటి తోటలో తండ్రి మొక్కలకు నీళ్ళు పడుతుంటే ఆసక్తిగా గమనిస్తూ తిరుగుతోంది ఆరేళ్ళ వినయ.

ఇంతలో బుజ్జి ఉడుత ఒకటి జామచెట్టు మీదినుంచీ దిగి మామిడిచెట్టు వైపు వెళ్తూ కనిపించింది. అది చాలా ముద్దుగా వుంది. ముందుకాళ్ళతో తోటలో రాలిన జామపండు, సపోట, సీతాఫలం లాంటివి తీసుకుని చకచకా తీసుకుని కొరుకుతూ అక్కడక్కడే తిరుగుతుంటే వినయకు చాలా ముచ్చటేసింది.

'డాడీ..నాకా ఉడుత కావాలి' అని అడిగింది.

'అయ్యో వద్దమ్మా. అది బాధపడుతుంది. హాయిగా తిరిగే ప్రాణులను బంధించకూడదు' అన్నాడు తండ్రి.

'అదంతా నాకు తెలియదు. దాన్ని పంజరంలో పెట్టి పెంచుకుందాం. పట్టివ్వు' అంటూ మారాం చేయసాగింది వినయ.

'సరే. ఇప్పుడు పొద్దుపోయింది కదా? రేపు పట్టిస్తా' చెప్పాడు చేతులు కడుక్కుంటూ.

• • •

మర్నాడు వినయ ఆమె తల్లితో కలిసి పండుగకు బట్టలు కొనడానికి షాపింగ్ మాల్‌కి వెళ్ళారు. తల్లి బట్టలు చూస్తుంటే వినయ షాపులో ఏం తోచక అటూ ఇటూ తిరగసాగింది. అప్పటివరకూ కూతుర్ని ఓ కంట కనిపెడ్తున్న వినయ తల్లి మరికొన్ని మంచి డిజైన్లకోసం కొంచెం ముందుకెళ్ళి చూసేలోపు వినయ లిఫ్ట్ వైపు నడిచింది.

లిఫ్ట్ లోపల ఎవరూ లేరు. లోనికెళ్ళి కనిపించిన మీటలేవో నొక్కేసరికి లిఫ్ట్ ద్వారాలు మూసుకుపోయాయి. లోపల ఒక్కతే ఉండిపోవటంతో భయంవేసి బిగ్గరగా అరవసాగింది వినయ.

అప్పటికే చుట్టుపక్కల పాప కనిపించకపోయేసరికి చూస్తున్న బట్టలు వదిలి కంగారుగా వెదుకుతూ వచ్చింది వినయతల్లి.

లిఫ్ట్‌లో నుంచీ పాప కేకలకు అంతా లిఫ్ట్ దగ్గర చేరారు. అక్కడి స్టాఫ్ కూడా కంగారుగా వచ్చి లిఫ్ట్‌ని బయటినుంచీ పరిశీలించి కంగారేమీ లేదని, పైన నాలుగవ అంతస్తులో ఆగుతుందని తామెళ్ళి తీసుకొస్తామని కొందరు మెట్లవైపు పరుగెట్టారు.

కాస్సేపటికే లిఫ్ట్ నెమ్మదిగా ఆగటం, వినయ కంగారుగా ఏడుస్తూ బయటకురాగా స్టాఫ్ ఎత్తుకుని అప్పటికే మెట్లెక్కుతున్న ఆమె తల్లికి సురక్షితంగా అందించారు. ఇద్దరూ హాయిగా ఊపిరితీసుకుని, స్టాఫ్‌కి కృతజ్ఞతలు తెలిపి బట్టలు కొని ఇల్లు చేరారు.

• • •

'వినయా త్వరగా రామ్మా. చూడు నీకోసం ఎంతో కష్టపడి ఉడుతను పట్టుకోగలిగాను బోనులో పెట్టి. చూడు ఎంత వేగంగా బోనులో అటూ ఇటూ తిరుగుతోందో' అని తోటలో నుంచి ఉడుతను తెచ్చి చూపుతూ అన్నాడు తండ్రి.

'నిన్న రెండు మూడు నిమిషాలకే ఒక్కదాన్ని లిఫ్ట్‌లో ఉండలేకపోయా. పాపం పెంచుకుందామని బంధిస్తే ఇదెంత భయపడుతుందో డాడీ. బయట చెట్లమీదే అది సంతోషంగా ఉంటుంది. వదిలేసెయ్' అంది వినయ.

కూతురి మాటలకు ఆనందించి బోను మూత తీయగానే హుషారుగా తోటలోకి రివ్వున పరుగెట్టింది ఉడుత. అది చూసి వినయ సంతోషంగా నవ్వుతుంటే, ఆమె తల్లి కూతురి మంచి ఆలోచనకు మెచ్చుకోలుగా దగ్గరికి తీసుకుని ముద్దులు పెట్టింది.

- దేగల అనితాసూరి
9247500819

పర్యావరణ బాలమిత్రులు

కాలుష్య కోరల్లోంచి పర్యావరణాన్ని పరిరక్షించే క్రమంలో పిల్లలూ ముందున్నారనే విషయాన్ని వీరిని చూసి చెప్పొచ్చు. తమ చుట్టూ ఉన్న వాతావరణం కలుషితమౌతోందని, స్నేహితులు ఇబ్బందులు పడుతున్నారని గ్రహించిన చిన్నారులు వాటి పరిష్కారానికై చిట్టి బుర్రలకు పెద్ద పని చెప్పి అనేక పర్యావరణహిత ఆవిష్కరణలు చేశారు. తల్లిదండ్రులు, టీచర్ల ప్రోత్సాహంతో వారికొచ్చిన వైఫల్యాలను, అడ్డంకులను అధిగమించి ముందుకు సాగారు.

బాలకార్మికుడి నుంచి ఆవిష్కర్తగా...

చిత్తూరుజిల్లా మదనపల్లిలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న నవీన్ పర్యావరణహిత వంట పద్ధతిని రూపొందించాడు. పాఠశాల ప్రాంగణంలో మధ్యాహ్న భోజనం సిద్ధపరచడంతో తరగతి గదులంతా పొగమయం కావడటంతో విద్యార్థులు ఊపిరాడనంతగా ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఇంట్లో కూడా ఇదే పరిస్థితి. సెల్యులోజ్ లైమ్, కొబ్బరిపెంకులతో ఏ మాత్రం పొగ వెలువడని వంట చెరకును తయారు చేశాడు. పొయ్యి డిజైన్‌లో కూడా కొన్ని మార్పులు చేర్పులు చేశాడు. ఈ ఆవిష్కరణ నవీన్‌ను జిల్లా, రాష్ట్ర స్థాయి సైన్సు ఆవిష్కరణల పోటీల్లో నిలిపింది. మొత్తం 450 ఆవిష్కరణల్లోంచి ఎంపిక చేసిన 70 ఆవిష్కరణల్లో ఒకటిగా, జాతీయ స్థాయి ఐదింటిలో ఒకటిగా నవీన్ ప్రయోగం ఎంపికైంది. నవీన్ తండ్రి కూరగాయలు అమ్ముకుని జీవనం సాగించేవారు. అయితే కుటుంబ పోషణకై నవీన్ కూడా పనిచేయాల్సి వచ్చి నాలుగో తరగతిలోనే చదువును ఆపేసి టీకొట్టులో చేరాడు. ఓ స్వచ్ఛంద సంస్థ అతడిని డ్రాపౌట్‌గా గుర్తించి తిరిగి చదువుకునే వీలు కల్పించింది. ఇదే నవీన్ జీవితాన్ని మలుపు తిప్పింది. జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన నవీన్ తను మాత్రమే కాక తన చుట్టూ ఉన్న పిల్లలు కూడా మంచి జీవనం సాగించాలని కలలు కంటున్నాడు.

అరటి ఆకులతో...

తమిళనాడుకు చెందిన తినిత్ ఆదిత్యకు పుస్తకపఠనం, పరిశోధనలు, ప్రయోగాలే లోకం. ప్లాస్టిక్ వాడకానికి బదులుగా 'బనానా లీఫ్ ప్రిజర్వేషన్' టెక్నాలజీని అనుసరించి అరటి ఆకులతో ప్లేట్లు, కప్పులు తయారు చేశాడు. వీటి తయారీకి సంవత్సరమంతా ఈ ఆకులను ప్రత్యేక పద్ధతిలో ఆరబెట్టి మరింత మన్నికైన వాటిగా చేశాడు. ఎక్కు సేపు ల్యాబ్‌లోనే గడుపుతూ ప్రయోగాలు చేసేప్పుడు అనేక ప్లగ్‌లు అవసరమయ్యేవి. దీంతో ఏ ప్లగ్ అయినా సరిపోయేవిధంగా 'ఎలక్ట్రిసిటీ ఎక్స్‌పాన్షన్ బోర్డు'ను తయారు చేశాడు. నాలుగో తరగతి వయస్సులోనే కంప్యూటర్ ల్యాంగ్వేజ్‌లను నేర్చుకున్నాడు. 15 ఏళ్లకే రాష్ట్రపతి భవనంలో నిర్వహించే 'ఇన్నోవేషన్స్

ఫర్ రెసిడెంట్స్' అనే ప్రోగ్రామ్‌కు ఆహ్వానాన్ని అందుకున్నాడు. రాత్రుళ్లు పరిశోధనల్లో గడిపేయడంతో స్కూలుకు లేటుగా వెళ్లి తరగతి గది బయట నిలుచుండేవాడు. అయినా తనలోని ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకుండా ప్రతి సబ్జెక్టులోనూ ఫస్ట్ వచ్చేవాడు. ఇంత కష్టపడిన ఆదిత్య గిన్నిస్ వరల్డ్ రికార్డుతో పాటు రెండు జాతీయ, ఐదు రాష్ట్రీయ ఇంకా మరెన్నో బహుమతులను అందుకున్నాడు. 'సమస్యల మధ్య జీవించను గానీ వాటిని పరిష్కరిస్తా'నంటాడు ఈ బుల్లి సైంటిస్టు. ప్రఖ్యాత మేధావి లియోర్డో డావిన్సీ జీవిత కథను చదివి ప్రేరణ పొందాడట. ఏరోనాటికల్ ఇంజినీరింగ్ చేసి అబ్దుల్ కలాం, స్టీఫెన్ హాకింగ్‌లా స్పేస్ సైంటిస్టు అవ్వడం తన లక్ష్యమంటున్నాడు.

సైకిల్ వాషింగ్‌మెషీన్...

ప్రతి రోజూ అమ్మ ఇంట్లో ఎన్నో పనులు చేస్తుంది. అదే అమ్మకు బాగోలేనప్పుడు పిల్లలు పనిచేయాల్సివస్తుంది. కేరళలోని కిజాత్తూర్ గ్రామంలోని 14 ఏళ్ల రేమ్యా జోస్ కూడా వాళ్ల అమ్మకు అనారోగ్యంగా ఉన్నప్పుడు బట్టలు ఉతికేది. ఈ పని కోసం ఎంతో సమయం, శక్తి కావాల్సి వస్తుందని గ్రహించిన ఈ యువతి అమ్మ కోసం ఏదైనా చేయాలనుకుంది. ఇంట్లో ఉన్న పాత సైకిల్ భాగాలను వాషింగ్‌మెషీన్‌కు



అనుసంధానం చేసి పెడల్ పవర్ వాషింగ్‌మెషీన్‌ను తయారు చేసింది. విద్యుత్ అవసరం లేకుండా పని చేయడం దీని ప్రత్యేకత. విద్యుత్ అందుబాటులోని ప్రదేశాల్లో కూడా దీనిని వినియోగించుకోవచ్చు. సైకిల్ పెడల్‌ను తొక్కడం ద్వారా ఆరోగ్యమూ లభిస్తుంది.

యాభై దేశాల్లో..

ప్రకృతిని రానున్న తరాల కోసం కాపాడాలని ప్రపంచవ్యాప్తంగా ఉద్యమం చేస్తున్న 14 ఏళ్ల అమెరికా యువకుడు జ్యుటెస్‌కాల్ట్ మార్టినెజ్. ఈ అంశంపై ఆరేళ్ల వయస్సున్నప్పటి నుంచే అంతర్జాతీయంగా ప్రసంగాలు చేయడం మొదలు పెట్టాడు. ఇతనొక పర్యావరణ పరిరక్షణ ఉద్యమ కార్యకర్త, హిప్‌హాప్ డ్యాన్సర్. తన ప్రసంగాల ద్వారా ప్రస్తుతం ఎదుర్కొంటున్న భూమి సమస్యలు వాటి పరిష్కారాల గురించి తోటి యువతకు అవగాహన కలిగిస్తున్నాడు. తానొక్కడే భూమంతటినీ కాపాడలేనని గ్రహించిన ఇతను అనేకమంది యువతను భూసంరక్షకులుగా తయారు చేస్తున్నాడు. ఇలా యాభై దేశాల్లో బృందాలను ఏర్పచుకున్నాడు. అంతేకాదు, భవిష్యత్ తరాల కోసం ప్రకృతిని కాపాడటంలో విఫలమైన అమెరికా ప్రభుత్వంపై దావా వేశాడు. తన సోదరి ఐసాతో కలిసి ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలను సంగీతం ద్వారా ప్రచారం చేస్తూ అందర్నీ ఆకర్షిస్తున్నాడు. భూమిని పునరుద్ధరించే

ఉద్యమానికి సంబంధించిన భూసంరక్షకులకు గైడ్‌గా ఉపయోగపడే 'వి రైజ్' అనే పుస్తకాన్ని రచించాడు. ఇలా అతను చేసిన కృషికై ఎన్నో అవార్డులు అందుకున్నాడు.

ప్లాస్టిక్‌ను లాగేసే...

నెదర్లాండ్‌కు చెందిన బోయన్ సాల్ట్ అనే 14 ఏళ్ల పిల్లవాడు సముద్రంలోని ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించేందుకు పరిశోధన చేశాడు. దాదాపు ఐదున్నరేళ్ల పరిశోధనాంతరం ఒక సొల్యూషన్‌తో ముందుకొచ్చాడు. 2000 అడుగుల పొడవున ఒక ట్యూబ్‌లాంటి పరికరాన్ని సముద్రంపై పరిచి మూడు మీటర్ల లోతులో ఉన్న ప్లాస్టిక్‌ను ఒక చోట చేర్చి తద్వారా బోటు సాయంతో వెలికితీస్తున్నారు. దీని ద్వారా 72,50,000 టన్నుల ప్లాస్టిక్‌ను సేకరించారు. ఇలాంటివి 60 పరికరాలను వాడటం వల్ల 2025 నాటికి పసిఫిక్ మొత్తాన్ని శుభ్రం చేయవచ్చుంటున్నాడు.



మానవ మలంతో ఇంధనం....

కెన్యాలోని మాసెనో పాఠశాల ఆధ్వర్యంలో 700 మంది విద్యార్థులకు వసతి గృహాలను ఏర్పాటు చేశారు. అయితే ఆ పరిసర ప్రాంతాల్లో సరైన మురుగు నీటి వ్యవస్థ లేకపోవడంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతుండేది. అయితే ఈ సమస్యను అధిగమించాలని లెరాయ్ అనే విద్యార్థి మరో నలుగురు స్నేహితులతో కలిసి హ్యూమన్ వేస్ట్ బయోరియాక్టర్‌ను తయారు చేశాడు. ఇది మానవ మలం నుంచి బయోగ్యాస్ ఇంధనాన్ని తయారు చేస్తుంది. లెరాయ్ తయారుచేసిన పర్యావరణహిత పరికరాన్ని మరింతగా అభివృద్ధి చేయాలనుకున్నాడు. అందుకు గ్రీన్‌పాక్ట్ అనే కంపెనీని స్థాపించాడు. కెన్యాలోని ఆరులక్షల మంది ప్రజలకు బయోగ్యాస్‌ను సరఫరా చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాడు.

తేనెటీగలను పరిరక్షించే రోబో..

నశించిపోతున్న తేనెటీగలను సేకరించే 'బీ సేవర్ బాట్' అనే రోబోను తయారు చేసింది ఢిల్లీకి చెందిన 12 ఏళ్ల కావ్య విఘ్నేష్. గ్రామీణ ప్రాంతాల్లోని తేనెటీగలను సేకరించి ప్రపంచవ్యాప్తంగా విస్తరింపజేస్తారు. వీటివల్ల ఫలదీకరణ, తేనె సేకరణ అభివృద్ధి చేసేందుకు వీలుకలుగుతుంది. ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఏడవ తరగతి చదువుతున్న కావ్య రోబోటిక్స్ హైటెక్ విధానాలను అనుసరించి దీనిని తయారు చేసింది. తాను చేసిన పరికరాన్ని డెన్మార్క్‌లో నిర్వహించిన అంతర్జాతీయ రోబోటిక్స్ కార్యక్రమంలో ప్రదర్శించింది.

శరీర ఉష్ణంతో వెలిగే టార్చ్...



మనుషుల ప్రతి కదలిక 100వాట్ల బల్బుకు అవసరమయ్యే శక్తిని విడుదల చేస్తుందట..! ఈ శక్తితో బల్బును వెలిగించేందుకు వాడుకుంటే..! ఈ దిశగా ఆలోచించి ఆన్ మాస్కోసింకి అనే 16 ఏళ్ల అమ్మాయి శరీర వేడిని వాడుకుని ఫ్లాష్‌లైట్ వెలిగే టార్చ్‌ను తయారు చేసింది. రెండేళ్ల క్రితం ఫిలిప్పైన్స్‌కు చెందిన తన స్నేహితుడు విద్యుత్ సౌకర్యం లేక హోంవర్క్ చేయకపోవడంతో ఆమె బాధ పడింది. అలాంటి వారి అవసరాల కోసం విద్యుత్ అవసరం లేకుండా వెలిగే టార్చ్‌ను తయారు చేసింది.

అరటి తొక్కలతో బయోప్లాస్టిక్..!

టర్కీకి చెందిన ఎలిఫ్ బెల్గిన్ అనే 16 ఏళ్ల అమ్మాయి ప్లాస్టిక్ వాడకానికి వ్యతిరేకంగా బయోప్లాస్టిక్‌ను తయారు చేయాలనుకుంది. ఇందుకోసం రెండు సంవత్సరాల పాటు పరిశోధనలు చేసి వాటిలో విఫలమైనా తన ప్రయత్నం ఆపలేదు. చివరికి ఎట్టకేలకు అరటి తొక్కలతో బయోప్లాస్టిక్‌ను తయారు చేసింది. ఈ ఆవిష్కరణతో పెట్రోలియం ఉత్పత్తులను తగ్గించవచ్చు. థాయ్‌లాండ్ వారు ఒక రోజుకు 200 టన్నుల అరటి తొక్కలను పారేస్తున్నారంట. వీటిని సేకరించి మంచిగా ఉపయోగించుకోవచ్చు అంటోందామె. ఈ ఆవిష్కరణకై 'సైన్సు ఇన్ యాక్షన్' అవార్డును అందుకుంది.

- కోడే హేమలత



నోరూరించే పుడ్డింగ్

పిల్లలు తిండి విషయంలో ఎప్పుడూ కొత్తగానూ, రుచిగానూ, కంటికింపుగానూ, వెరైటీగానూ ఉంటేనే ఇష్టపడతారు. తినేందుకు ఆసక్తిని కనబరుస్తారు. అయితే పెద్దలుగా మనం అందులో పోషకాలనూ, ప్రోటీన్లను అందుతున్నాయో.. లేదో చూసుకోవాలి. పిల్లలు రోజూ ఉడకబెట్టిన గుడ్డును తినడానికి మారాం చేస్తుంటారు. అటువంటి వారికోసం ఆ రెండింటి కాంబినేషన్‌తో ఎంతో మెచ్చే పుడ్డింగ్‌ను ఎలా చేయవచ్చో చూడండీ.!

ముందుగా అరలీటరు పాలను తీసుకుని చిక్కగా కాగబెట్టుకోవాలి. వాటిని చల్లారనిచ్చి అందులో వంద గ్రాముల బెల్లం, రెండు స్పూన్లు మిరియాలపొడి, ఒక స్పూను యాలకుల పొడి, వేసి బాగా కలుపుకుని పక్కన పెట్టుకోవాలి. ఐదు గుడ్లను తీసుకుని వాటిని మరో గిన్నెలో వేసుకుని బాగా గిలకొట్టుకోవాలి. ఇప్పుడు ఆ మిశ్రమాన్ని పాలు, బెల్లం, మిరియాలపొడి, యాలుకులపొడి గిన్నెలో వేసి బాగా కలుపుకోవాలి. అవెన్ అందుబాటులో లేనివారు వెడల్పాటి కుక్కర్‌లోనూ తయారు చేసుకోవచ్చు. కుక్కర్ అడుగు భాగంలో ఒక వంతు నీళ్ల పోసి కాస్తా వేడెక్కిన తర్వాత అందులో ఇమిడే గిన్నెను అమర్చుకోవాలి. పుడ్డింగ్ కోసం తయారు చేసిన మిశ్రమాన్ని ఆ గిన్నెలో వేసి విజిల్ లేకుండా కుక్కర్ మూతని పెట్టాలి. సన్నని మంటపై ముప్ఫై నిమిషాలు ఉడికిస్తే సరిపోతుంది. ఆ తర్వాత ఆ మిశ్రమాన్ని చల్లారనిచ్చి దానిని ఫ్రిజ్‌లో పెట్టుకుని అరగంటైన తర్వాత తీసుకుని పిల్లల ఎదురుగా పెడితే లొట్టలేసుకుని మరీ తింటారు. అందులో ఉండే గుడ్డు, బెల్లం, పాలు, మిరియాలు, యాలుకుల వల్ల ఐరెన్, విటమిన్, ప్రొటీన్ లభించి సులువుగా జీర్ణమౌతుంది.



మిక్స్‌డ్ సలాడ్

మిక్స్‌డ్ సలాడ్ అంటే ఇష్టపడని పిల్లలు ఉండరు. కూల్ కూల్‌గా ఫ్రూట్స్‌తోపాటు కూరగాయలనూ తినేందుకు ఎంతగానో ఇష్టపడతారు. ప్రత్యేకంగా పిల్లలకోసం ఈ వేసవిలో రుచికరమైన సలాడ్‌ను అందించండి. వారికిష్టమైన పండ్లు, కూరగాయలతో చేస్తే... 'మ్..మ్...' అనుకుంటూ తింటారు. అందుకోసం కావాల్సినవి పచ్చి మామిడికాయ ముక్కలు ఒక కప్పు, మామిడి పండు ముక్కలు ఒక కప్పు, టమాటాలు నాలుగు, కీరాదోసకాయ ముక్కలు, సన్నని ఉల్లిపాయలు, ఆలివ్ ఆయిల్, నిమ్మరసం, వాము, మిరియాలపొడి, ఉప్పు ఉంటే చాలు..! పండ్లను, కూరగాయ ముక్కల్ని ఒక గిన్నెలో వేసి అందులో నిమ్మరసం, మిరియాలపొడి, ఉప్పు, ఆలివ్ ఆయిల్‌ను వేసి కలుపుకోవాలి. అరగంటపాటు ఈ సలాడ్‌ని ఫ్రిజ్‌లో పెట్టి తీసి తింటే కాస్త పుల్లగా, తియ్యగా, కారంగా ఎంతో ఇష్టపడతారు. ఇందులో ఉండే కీరా దాహాన్ని తీరుస్తుంది. మొత్తంగా రుచికి రుచీ... ఆరోగ్యానికి ఆరోగ్యం.

రుచి

షేక్ ది మ్యాంగో

'ది కింగ్ ఆఫ్ ఆల్ ఫ్రూట్స్' అనగానే మామిడి పండని తెలియనివారు ఎలా ఉండరో అలాగే మామిడి పండుని ఇష్టపడని వారంటూ ఎవరూ ఉండరు. నోరూరించే ఈ పండుతో మ్యాంగో షేక్ చేసుకుందాం రండీ..!

బాగా పండిన బంగినపల్లి మామిడి పండుని తీసుకుని చెక్కుతీసి ముక్కలుగా కోసుకోవాలి. ఆ ముక్కల్ని మిక్సీ జార్‌లో వేసి బాగా మిక్స్ చేసుకోవాలి. అందులో ఒక స్పూన్ తేనె, ఒక స్పూన్ పంచదార, పావు గ్లాస్ పాలు వేసుకుని కొద్దిసేపు తిప్పాలి. తర్వాత ఆ మిశ్రమాన్ని గ్లాస్‌లోకి తీసుకుని అందులో మంచినీటితో ఫ్రిజ్‌లో పెట్టుకున్న ఐస్ క్యూబ్‌లను వేసుకుంటే మ్యాంగో షేక్ రెడీ. ఇక ఆలస్యం చేయకుండా ఆస్వాదిస్తూ తాగడమే..!

వారి కలల్లోకి.. వారి కథల్లోకి...

50 మంచి యానిమేషన్ చిత్రాలు

పిల్లలది రంగురంగుల వైవిధ్య ప్రపంచం. ఎన్నో ఆశ్చర్యాలు, అద్భుతాలు వారి ఊహల్లో, కలల్లో జరుగుతుంటాయి. వారాడుకునే బొమ్మలే, వారు చూసే జంతువులే, వారికిష్టమైన తిండి, వస్తువులే ఊహల్లో పాత్రలుగా ప్రాణం పోసుకుంటాయి. ఓ లెగో బ్రిక్‌కీ బోలెడు కథుంటుంది. డైనోసార్ కథకీ ఎంతో వాస్తవికత నేపథ్యముంటుంది. బాలల కాల్పనిక, ఊహాప్రపంచాన్ని కళ్లకు కట్టినట్టు చూపించేవే యానిమేషన్ చిత్రాలు. వీటిల్లో పెద్దలూ తప్పక చూడాల్సినవెన్నో..! 'ట్రాల్స్' అనే ఆటల-పాటల చిత్రంలో జీవిత కాంట్రాస్ట్‌ని కలర్‌ఫుల్‌గా చెప్పేస్తారు. సంతోష తావు గుండెల్లో, ఆలోచనల్లోనే ఉందని చెబుతుందిది. ఇక 'గుడ్ డైనోసార్' చిత్రంలో మనిషి వన్యప్రాణిగానూ, డైనోసార్లేమో నాగరికులుగానూ కథ అడ్డం తిరుగుతుంది. తండ్రిని వెదుక్కుంటూ అడవంతా తిరిగే ఓ బుల్లి రాక్షసబల్లి కథ చిన్నారుల్నే కాదు, పెద్దల్నీ కదిలిస్తుంది.

పర్యావరణ సమస్యల గురించి ఎంత పెద్ద క్లాసులు తీసుకుని ఏం లాభం 'ఫైండింగ్ నెమో', 'హ్యాపీ ఫీట్', 'వాల్-ఈ' వంటి చిత్రాల్ని చూపిస్తే సరి. ఒక్క ఈ విషయమనే కాదు, బలహీనతల్ని జయించడం, పోరాడి మనుగడ నిలుపుకోవడం, అనుబంధాలు, మానవీయ సంబంధాల విలువ తెలుసుకోవడం ఇలాంటివెన్నో జీవిత పాఠాల్ని సరదా సరదాగానే నేర్పిస్తాయివి. రంగు, ఎత్తు, రూపంలో తేడాలు ఇలాంటివేవీ కూడా స్నేహాలకు అడ్డుకావని, మనలోని హీరోకి కొలమానాలు కావని కామిక్ కేరెక్టర్‌లు కళ్లకు కడతాయి. 'జూటోపియా', 'కోకో', 'డెస్పికబుల్ మీ', 'ష్రెక్', 'సెంగ్' ఆ కోవలోకి వచ్చేవే. చిన్నారుల్ని భయపెట్టే మృగాలు, దెయ్యం గియమనే ఊహాజీవులవీ పీడకల్ని మిగల్చవీ చిత్రాల్లో. అవన్నీ సరదాగా, చాలా చాలా ఫ్రెండ్లీగా కనిపిస్తాయి. ప్రాణమిత్రుల్లా మారిపోయి హత్తుకునేంత దగ్గరివారై సూపర్ హీరోలైపోతాయి. 'హోటల్ ట్రాన్సిల్వేనియా', 'హౌ టూ ట్రైన్ ఎ డ్రాగన్', 'మోన్స్టర్స్ ఇంక్' చిత్రాలన్నీ భయంలేకుండా చూసేయొచ్చు. జానపదాల్ని రంగరించిన 'అల్లాదీన్', 'మోవానా', 'కుంగ్‌ఫూ పాండా', 'ఫ్రోజెన్', 'ట్యాంగిల్డ్', 'బ్రేవ్' అనేక సంస్కృతుల్ని, వైవిధ్య జీవనాల్ని పిల్లలకు మరింత దగ్గర చేస్తాయి. సొంతమనేలా వారి ప్రపంచాన్ని మరికొంచెం విస్తారం చేస్తాయి. బాలల ప్రపంచాన్ని కేరింతలతో ముంచెత్తే యానిమేషన్ చిత్రాల్లో కొన్నింటిని లిస్ట్ చేశాం. వీటిలో మీరిప్పటికే చూసిన చిత్రాల్నీ మరోసారి జాగ్రత్తగా గమనిస్తూ చూడండి.. బోలెడు కొత్త విషయాలు తెలుస్తాయి. చూడనివాటిని ఎంజాయ్ చేస్తూ ఓసారి, ఇంకేం చెప్పారబ్బా.. అనుకుంటూ మరోసారి చూసేయండి. పెద్దల్నీ పూర్తిగా చూసేయమనండి. వాళ్లు గమనించిన విషయాల్ని సరదా కబుర్లతో చర్చ పెట్టేయండి.

- ★ టాయ్ స్టోరీ-1,2,3
- ★ అప్
- ★ ఫైండింగ్ నెమో, డోరీ
- ★ ది లెగో మూవీ
- ★ వాల్-ఈ
- ★ ఇంక్రెడిబుల్స్
- ★ హౌ టూ ట్రైన్ ఎ డ్రాగన్
- ★ మోన్‌స్టర్స్ ఇంక్ 1,2
- ★ ఫ్రోజెన్
- ★ కోకో
- ★ హ్యాపీ ఫీట్
- ★ మోవానా
- ★ జూటోపియా
- ★ కుంగ్‌ఫూ పాండా
- ★ యాంగ్రీ బర్డ్స్
- ★ ట్రాల్స్
- ★ కార్స్
- ★ బిగ్ హీరో 6
- ★ రియో
- ★ డెస్పికబుల్ మీ 1,2



- ★ లయన్ కింగ్
- ★ బ్రేవ్
- ★ ష్రెక్
- ★ వ్రెక్ ఇట్ రాల్ఫ్
- ★ విన్నీ ద పూ
- ★ ట్యాంగిల్డ్
- ★ ఇన్‌సైడ్ అవుట్
- ★ రాటాటౌల్
- ★ పుస్ ఇన్ ది బూట్స్
- ★ అల్లాదీన్
- ★ మడగాస్కర్ 1,2
- ★ సింగ్
- ★ గుడ్ డైనోసార్
- ★ ది సీక్రెట్ లైఫ్ ఆఫ్ పెట్స్
- ★ ది ల్యాండ్ బిఫోర్ టైమ్
- ★ హోటల్ ట్రాన్సిల్వేనియా 1,2
- ★ ర్యాంగో
- ★ క్రూడ్స్ 1,2
- ★ ఐస్ ఏజ్ 1,2,3
- ★ ప్లేన్స్



రంగుల రాకుమారుడు



'మోన్..! నీ కోసం వీళ్లొచ్చారు.' అంటూ నాన్న క్లింట్ ఫొటో వైపు చూసేవాడు.

'వీడికి కలువలంటే ఎంత ఇష్టమో' అంటూ అమ్మ క్లింట్‌ను గుర్తుతెచ్చుకుంటూ పూలతో చేసే రంగవల్లిని సర్దేది.

ఇది కేరళకు చెందిన ఆరేళ్ల ఆర్టిస్ట్ ఎడ్మండ్ థామస్ క్లింట్ అమ్మానాన్నల ప్రతిరోజు. ఇంకో నెల అయితే ఏడేళ్లు వస్తాయనగా, 1983లో కిడ్నీ వ్యాధితో క్లింట్ చనిపోయాడు. కానీ, అతడు అమ్మానాన్నల గుర్తుల్లోనే కాదు, తన చిత్రాలతో ప్రపంచమంతా బతికేస్తున్నాడు. రెండున్నరేళ్లకే పర్ఫెక్ట్‌గా సున్నా గీసిన క్లింట్ ఓ వండర్‌కిడ్. తాను బతికింది 2552 రోజులే అయినా 25000 చిత్రాల్ని వేశాడు..! ఇప్పుడు క్లింట్ పేరిట కేరళ పర్యాటక శాఖ ఓ అంతర్జాతీయ పెయింటింగ్ కాంపెటీషన్‌ను నడుపుతోంది. ఈసారి 116 దేశాల నుంచి 36 వేలకు పైనే ఎంట్రీలొచ్చాయి. ఎంతో వైవిధ్యమైన రంగులతో చిత్రాల్ని గీసే క్లింట్‌ని 'ప్రిన్స్ ఆఫ్ కలర్స్' (రంగుల రాకుమారుడు) అని పిలుస్తారు.

అమ్మమ్మవాళ్ల ఊళ్లో..

క్లింట్‌కు జంతువులన్నా, చెట్లన్నా భలే ఇష్టం. చాలా ప్రేమ. అతడి చిత్రాల్లో ఏనుగులెక్కువగా కనిపిస్తాయి. వినాయకుడికి 'అనాతంబాయి' (ఏనుగు దేవుడు) అని తానే పేరు పెట్టుకున్నాడు. రోడ్డు పక్కనున్న మర్రి మొలకను పీక్కొచ్చి అమ్మచేతికిచ్చాడు, మనింట్లో పెంచుకుందామని. ఇప్పటికీ ఆ మొక్కను వాళ్లమ్మ చిన్నమ్మ పెంచుతున్నారు. క్లింట్ నాన్న జోసెఫ్ ఇన్నాళ్లూ అతడి పెయింటింగ్‌ల్ని జాగ్రత్తగా కాపాడుతూ వచ్చారు. వారింట్లోనే ప్రదర్శనకు ఉంచారు. కొన్ని నెలల క్రితమే ఆయనా చనిపోయారు. క్లింట్‌కు కథాకళి అన్నా మిగతా సంబరాలప్పుడు డ్యాన్సులన్నా చాలా ఇష్టం. సూర్యోదయం, నది ఒడ్డున పడవలు, సంబరాలు... ఇలా తాను చూసిన ఎన్నో విషయాల్ని చిత్రాలుగా గీశాడు. అతడిది ఫొటోగ్రాఫిక్ మెమొరీ. క్లింట్ పెరిగిన మార్శితెవారా ఊరి రోడ్డుకి అతడి పేరే పెట్టారు. క్లింట్‌కు అమ్మమ్మవాళ్ల ఊరంటే (మంజుమ్మెల్) చాలా ఇష్టం. అక్కడ చూసిన ఎన్నో దృశ్యాల్ని పెయింటింగ్ వేశాడు. అదే ఊళ్లో క్లింట్ సమాధి ఉంది. క్లింట్ ఆరోగ్యం పాడవడానికి కారణం ఎక్కువ డోసున్న మందు బిళ్లలు వాడటమే..! క్లింట్ జీవిత కథతో ఓ సినిమా, కొన్ని డాక్యుమెంటరీలు తీశారు. పుస్తకాలు కూడా వచ్చాయి. క్లింట్‌కు బోలెడు ఫ్రెండ్సట..! ఓసారి తనింటికి 35 మందిని వెంటేసుకొచ్చాడు. ఇది తెలియని వాళ్లమ్మ అప్పటికే వారి వరకే కొంత బిర్యానీ చేశారు. దాన్నే తలా రెండు గరిటెలు పెడితే క్లింట్ గట్టిగా నవ్వేశాడట..! తల పక్కకుబెట్టి ఆగకుండా గట్టిగా నవ్వేవాడట..! ఆ నవ్వు చూసే వాళ్ల నాన్న 'మోన్..' అని ముద్దు పేరు పెట్టాడు. అంటే 'అల్లరి బుల్లి రాక్షసుడా' (లిటిల్ మోన్‌స్టర్) అని. అలా పిలుస్తూ క్లింట్‌ని అమ్మానాన్నలు హత్తుకుని ముద్దాడేవారు.







చిట్టి బండి ప్రయాణం



గేయ కథ

ఎండ దండిగా కాసేవేళ
మండుటెండగా మారేవేళ
బయలుదేరెను బండి ఒక్కటి
బండిలోపల చిట్టి ఒక్కతే!



వడివడి పరుగులు పెడుతూ బండి
హడావిడిగా వెడుతూ ఉంది
గడబిడ సవ్వడి చేస్తూ బండి
గమ్యం వైపుగా వెడుతూ ఉంది

వెడుతూ వెడుతూ మువ్వలబండి
వేగం బాగా తగ్గింది
ఎండవేడిమి పెరిగే కొద్దీ
పయనం బరువుగా మారింది!

అంతకంతకు నెత్తిన ఎండ
పెరుగుతు చిట్టిని బాధిస్తోంది!
ప్రయాణమేమో బహుకష్టంగా
మారుతూ చాలా వేధిస్తోంది!!

చిట్టిమోములో చికాకు కొంత
సూర్యుడిపైన కోపం కొంత
ఎలాగ ముందుకు సాగాలంటూ
మదిలో కలిగెను బోలెడు చింత!

ఎండ చుర్రున కాస్తూ ఉంది
ఉక్కపోతా మొదలయ్యింది!
దిక్కుతోచక చిట్టి ఒక్కతీ
దిక్కులు చూస్తూ నిలబడి ఉంది!

కడలిక బాగా వచ్చేసింది
కళ్లను మైకం కమ్మేసింది!
అచేతనంగా అలాగే చిట్టి
నిస్సత్తువగా పడిపోయింది!!

అమ్మ చెప్పిన మాటలప్పుడే
ఒక్కటొకటిగా గుర్తొచ్చాయి!
కమ్మని నీతులు వింటే చాలా
మేలు జరుగును అన్పించింది!

'చిట్టితల్లీ ఈ వేళప్పుడు
షికారు చేయకు చికాకు నీకు
ఎండలు మండే వేసవికాలం
నీడన ఉంటే మంచిది మనకు

హడావిడిగా పనులకు దిగితే
అలసట నిన్నూ కమ్మేస్తుంది
శక్తి మొత్తం హరించిపోయి
నీర్సం ఇట్టే ముంచేస్తుంది!

మంచినీటినే నిత్యం తాగు
ఇంటి పట్టునే కాలం గడుపు
సరదా పేరిట ఎండన తిరిగీ
బాధలు పడకు బంగారుతల్లీ!'

అమ్మ మాటలు పట్టని చిట్టి
దొంగచాటుగా బండిని ఎక్కి
బజారువైపుగా బయలెల్లింది
ఇలాగు ఎండకు సొమ్మసిల్లింది!

అమ్మ చెప్పిన ముద్దు మాటలు
వింటే ఇలాగు జరిగుండేనా?
నీర్సం, అలసట కలిగించే ఈ
ఎండదెబ్బకు గురి అయ్యేనా?

పెద్దలు చెప్పే మంచి మాటను
పెడచెవిన పెట్టొద్దెప్పుడూ!
చిట్టికి కలిగిన అనుభవాన్ని
మీరు కూడా మరవొద్దెపుడూ!!

\- సత్యాజీ